18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
అనంతపురం | శ్రీ సత్యసాయి
మంగళవారం | 04 ఫిబ్రవరి 2025 | పేజీలు 20

గత ఐదేళ్లలో

# క్రీడా వ్యవస్థ అధ్వానంగా మారింది..

పరిటాల ఘాట్ వద్ద నివాళి..
ఎమ్మెల్యే సునీతతో భేటి..

క్రీడా పరంగా నియోజకవర్గంలో సమస్యల్ని వివరించిన ఎమ్మెల్యే సునీత..

రామగిరి స్టేడియంను పరిశీలించిన శాప్ చైర్మన్ రవి నాయుడు..

రామగిరి స్టేడియంకి మరమ్మతులు చేయిస్తానని హామీ..

చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి స్టేడియంలు నిర్మిస్తామన్న రవినాయుడు

శాప్ చైర్మన్ రవినాయుడు..



రామగిరి మేజర్ న్యూస్: గత ఐదేళ్లలో క్రీడా వ్యవస్థ పూర్తిగా అధ్వాన్నంగా మారిందని.. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ రామగిరిలోని పరిటాల రవీంద్ర స్టేడియం అని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. ఆయన సోమవారం వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా

మిగతా 2లో

411 పోస్టులలో 343 మంది మీ విద్యార్థులేనా?

- తెలంగాణ కానిస్టేబుల్ ఉద్యోగాల్లోనూ 310మంది
- నిరుద్యోగులే టార్గెట్‌గా అనంతలో పాగాకు కసరత్తులు

- రాష్ట్రస్థాయిలో ఉన్నత పోలీసు అధికారులతో సత్సంబంధాలు
- తీగ లాగితే ఎక్కడెక్కడో కదులుతున్న విజయడొంక
- అనంతలో పలువురు పోలీసు అధికారులచే ఇనిస్టిట్యూట్ బుక్ ఆవిష్కరణ



# శ్యామ్ అదెలా సాధ్యం..!?




మేడిపండా..మామిడి పండా.. లేక నోరూరించే చింతపండా?. శ్యామ్ ఆ నిరుద్యోగుల పాలిట నీవు ఏ పండు. రికార్డులకే రికార్డులు బద్దలు కొట్టేలా నిరుద్యోగులకు పోలీసు ఉద్యోగాలు వామ్మో !!
ఊహించుకుంటేనే నీవే ఒక రికార్డు అని తెలిసిపోతుంది.

అనంతపురం క్రైమ్, మేజర్ న్యూస్

ఇక అసలు విషయానికొస్తే..
శ్యామ్ అదెలా సాధ్యం?

2023 ఏపీ ఎస్ఐ ఫలితాల్లో 411 పోస్టులకుగాను 343 మంది ఎంపిక వామ్మో, వింటుంటేనే ఇది నిజమేనా? ఎందరికో ఆశ్చర్యం కలిగించిన నీవు ప్రచురించిన శ్యామ్ ఇన్స్టిట్యూట్ ఆ బుక్ మెటీరియల్ చూసి 'మేజర్ న్యూస్' సైతం అవాక్క వడమే ఇక్కడి విశేషం.




ఇదే కాదు తెలం గాణ సబ్ ఇన్స్పెక్టర్స్ గా శ్యామ్ విద్యార్థులు బ్రేకింగ్ న్యూస్ లా మరో సంచలన రికార్డ్ సృష్టించారని ఆ మెటీరియల్ పుస్తకంలో కనిపించింది. అలాగే చెప్పు కుంటూ పోతే తెలంగాణ 2023 పోలీస్ కానిస్టేబుల్స్‌గా

మిగతా 3లో



జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం

# విజయవంతం చేయండి

పుట్టపర్తి మేజర్ న్యూస్: ఈనెల 10వ తేదీ జరిగే జాతీయ నులిపురుగుల నిర్మూల దినోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు.సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో శ్రీ సత్యసాయి జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈనెల 10 వ తేదీ జరిగే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం మరియు 17 వ తేదీన జరిగే మాప్ అప్ డేను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చేతన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండాజోల్ 400 ఎంజి మాత్రను నమలి మింగించాలన్నారు. ఒకటి నుంచి 5 సంవత్సరాల పిల్లలకు అంగన్వాడి సెంటర్ల లో, ఆరు నుంచి 19 ఏళ్ల పిల్లలకు స్కూలు మరియు కాలేజీల్లోనూ నమలి మింగించాలన్నారు. జిల్లా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో 3,66,225 మంది పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా వీటిని అందిస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫైరోజా బేగం, డిసిహెచ్ఎస్ డాక్టర్ తిపేంద్ర నాయక్, ఆర్బిఎస్కే పీవో డాక్టర్ నివేదిత పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్ సీటు

# టిడిపి కైవసం

హిందూపురం మునిసిపల్ చైర్మన్‌గా డి.ఈ.రమేష్‌కుమార్ ఘన విజయం

ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

హిందూపురం మేజర్ న్యూస్: స్థానిక మున్సిపల్ చైర్మన్ సీటు టిడిపి కైవసం చేసుకుంది. టిడిపి,వైసిపి చైర్మన్ సీట్ కోసం ముఖాముఖి పోటీ పడగా ఎంతో ఉత్కంఠ భరితంగా జరిగిన ఎన్నికల్లో టిడిపి మెజార్టీ నిరూపించు కోవడంతో టిడిపి 6 వార్డ్ కౌన్సిలర్ డి.ఈ.రమేష్ కుమార్ మున్సిపల్ చైర్మన్ గా గెలుపొందారు.వైసిపి నుండి 14 మంది కౌన్సిలర్ హాజరు కాగా టిడిపి నుండి 21 మంది కౌన్సిలర్లు, ఎంపీ బికే పార్థసారథి, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హాజరై తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మిగతా 4లో

# అనంత టు అంతర్జాతీయం..

ఉద్యాన రైతులకు అత్యద్భుత అవకాశం...



అనంతపురం మేజర్ న్యూస్ ప్రతినిధి

రేపటి హార్టికల్చర్ కాంక్లేవ్ అనంత చరిత్రలో ఓ సువర్ణ అధ్యయనం...

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో

స్వర్ణ అనంత దిశగా అడుగులు వేస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్..

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ...

జిల్లా ఇన్చార్జి మంత్రి టీజీ భరత్ సంకల్పిస్తేనే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు సాధ్యం..

కష్ట కాలంలో ప్రాసెసింగ్ యూనిట్ లే ఉద్యాన రైతులకు వెన్నుదన్ను..

04



# శ్రీరంగనీతులు మానుకో! పెద్దారెడ్డి..

- కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎమ్మెల్యే కాకముందు నీ ఆస్తులు ఎంత ? ఇప్పుడు నీ ఆస్తులు ఎంత
- అడ్డగోలు అక్రమాలే నీ రాజకీయ భవిష్యత్తుకు సమాధి
- తెలుగుదేశం నాయకుడు ఎస్.వి రవీంద్రా రెడ్డి (పొట్టి రవి) ని 5 సంవత్సరాలు తాడిపత్రిలోకి రానివ్వకుండా ఉన్నప్పుడూ రాజ్యాంగం కనపడలేదా?
- గతంలో తాడిపత్రిలో పనిచేసిన డిఎస్పి చైతన్య, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ ఖాజా హుస్సేన్, ఎస్ఐ గౌస్ లను నీ ఇంట్లో పనిమనుషులు లాగా వాడుకోలేదా?

మాజీ ఎమ్మెల్యే పై మున్సిపల్ కౌన్సిలర్లు ఫైర్

అనంతపురం, మేజర్ న్యూస్ : ఓ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇప్పటికైనా నీ శ్రీరంగ నీతులు మానుకో.. నీకు ఇంకా బుద్ధి రాలేదా గత మున్సిపల్ ఎన్నికల్లో గట్టిగా

మిగతా 3లో

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి వద్ద అన్నదాన కార్యక్రమం



పుట్లూరు,మేజర్ న్యూస్ :పుట్లూరు మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి వద్ద అన్న దాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా బిజేపి పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ కుందు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ వివిధ పనుల మీద అధికారులకోసం ఫిర్యాదులు అందించడానికి వచ్చిన వారికి, స్వామివారి భక్తాదులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్నదాన కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు తెలిపారు.గత 68 వారాల నుండి అన్నదాన కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దాతలు ఓబులేసు, నాయకుని పల్లి భాష, వెంకట్రామిరెడ్డి మరియు స్వామివారి భక్తాదులు పాల్గొన్నారు.

## 90 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం



రాయదుర్గం, మేజర్ న్యూస్: వసంత పంచమి సందర్భంగా స్థానిక సరస్వతి విద్యా మందిరం లో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించి నట్లు పాఠశాల కమిటీ అధ్యక్షులు పొరాళు ధనార్జున తెలిపారు. స్వామి అర్చనానంద అక్షర శ్రీ కారం గావించినట్లు తెలిపారు. చిన్నారుల నాలుక పై బీజాక్షరాలు రాసి స్వామి ఆశీర్వదించినట్లు తెలిపారు. అనంతరం సమితి కార్యదర్శి సోమా నీలకంఠ వసంత పంచమి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి తుకారాం, కోశాధికారి శంకర్, సభ్యులు వేణుగోపాల్ శెట్టి, హులికుంట మూర్తి, సాంబమూర్తి , కౌన్సిలర్ ప్రశాంతి , ప్రధానాచార్యులు రాజేశ్వరి , ఆచార్య బృందంతో పాటు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పదవతరగతి మోడల్ మెటీరియల్ పంపిణీ

శెట్టూరు, మేజర్ న్యూస్ : మాకొడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో



చదువు తున్న పదవతరగతి విద్యార్థులకు ఉపాధ్యా యుడు బద్దేనాయక్ త్వరలో జరగబోవు పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత రూపొందించబడిన 10వ క్లాస్ మోడల్ పేపర్స్ ను ఉచితంగా అందించ డం జరగింది. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఎపియుటిఎఫ్) ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత రూపొందించబడిందని, ఇందులో నుండి దాదాపుగా 70% పైగా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంద ని కావున విద్యార్థులకు పరీక్షకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని, విద్యార్థులు అందరూ దీనిని చక్కగా చదువుకుని మంచి ఫలితాలు తేవాల ని ఉపాధ్యాయుడు బద్దేనాయక్ విద్యార్థులను కోరారు. పాఠశాల విద్యార్థు లకు మోడల్ పేపర్స్ ఉచితంగా అందించినందుకు పాఠశాల ఉపాధ్యా యులు బద్దేనాయక్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోనంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా వసంత పంచమి

బెలుగుప్ప, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని కోనంపల్లి గ్రామ



ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు వసంత పంచమి ఘనంగా నిర్వహించారు. అనం తరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ హిందువులు ప్రతి సంవత్సరం మాఘమాసం శుక్లపక్షంలో వచ్చే పంచమి ని వసంత పంచమి గా జరుపుకుంటారని శీతాకాలానికి వేసవికాలంకి సంధి కాలమైన వసంత ఋతువు ఆరంభాన్ని సూచించడంతో వసంత పంచమిగా పిలుస్తారని వసంత పంచమి రోజున సరస్వతి దేవిని పూజించి పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తే వారికి చదువు బాగా వస్తుందని అలాగే వసంత పంచమి రోజున సరస్వతి దేవిని పూజిస్తే వారికి ఎంతో పుణ్యం లభిస్తుందని హిందువులను నమ్మకం అనీ విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ, సుధా మాధవి, మాధవి కుమారి, లతా రాణి, ఉమాదేవి, శ్రీరాములు, మల్లికార్జున బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

## గత ఐదేళ్లలో క్రీడా వ్యవస్థ

# అధ్వానంగా మారింది..

▸▸ మొదటి పేజీ తరువాయి

కలిశారు. ముందుగా పరిటాలరవి ఘాట్ వద్ద నివాళులర్పించారు. అనంతరం పరిటాల నివాసంలో ఎమ్మెల్యే సునీతతో భేటి అయ్యారు. క్రీడా పరంగా నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే సునీత వివరించారు. పాఠశాలల్లో క్రీడల పరంగా ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. గతంలో తాము ఏర్పాటు చేసిన వాటిని కూడా పర్యవేక్షణ లేక నిర్వీర్యం చేశారన్నారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి స్పోర్ట్స్ స్టేడియంల గురించి చర్చించారు. వైసీపీ హయాంలో అవి ఎలా మరుగున పడ్డాయన్నది ఎమ్మెల్యే సునీత వివరించారు. అనంతరం రామగిరి ఎంజేపీ పాఠశాలకు చెందిన జూడో టీం విద్యార్థులు శాప్ ఛైర్మన్ ను కలిశారు. ఇటీవల రాష్ట్రంలో సాధించిన పతకాలతో ఎమ్మెల్యే సునీత సమక్షంలో శాప్ ఛైర్మన్ ని కలిశారు. ఒక మారు మూల ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు ఇలా జూడో వంటి క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఈ పాఠశాలలో క్రీడలు ఆడుతున్న వారిని ప్రోత్సహించాలని.. ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అక్కడి నుంచే నేరుగా రవినాయుడు రామగిరిలోని పరిటాల రవీంద్ర మెమోరియల్ స్టేడియంకు వెళ్లారు. స్థానిక టీడీపీ నాయకులు, శాప్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులతో కలిసి స్టేడియంను పరిశీలించారు. టీడీపీ హయాంలో 2కోట్ల 20లక్షలతో స్టేడియం నిర్మిస్తే.. ఆతర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో దీనిని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. రామగిరి ప్రాంతంలో విద్యార్థులు, క్రీడాకారులకు ఉపయోగపడే ఈ



స్టేడియంను అధ్వాన్నంగా మార్చేశారని టీడీపీ నాయకులు వివరించారు. వెం టనే వీటి మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని రవినాయుడు ఆదేశించారు. స్టేడియంకు పూర్వ తెస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు గత టీడీపీ ప్రభుత్వంలో 2.20కోట్ల అంచనాలతో చేపట్టిన చెన్నేకొత్తపల్లి, కనగా నపల్లి స్టేడియంల నిర్మాణం కూడా వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిపి వేశారన్నారు. అప్పటి వరకు చేసిన ఖర్చు.. వృథా అయిందన్నారు. ఈ రెండు స్టేడియంలు కచ్చితంగా నిర్మిస్తామని.. తాజాగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని ప్రాంతాల్లో ఇలా క్రీడా వ్యవస్థను అధ్వాన్నంగా మార్చేశారని రవినాయుడు మండిపడ్డారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో క్రీడల పట్ల యువతకు చాలా ఆసక్తి ఉందని.. వారిని అన్ని విధాలు ప్రోత్సహిస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు రామ్మూర్తి నాయుడు, ఎమ్మెల్యే సోదరుడు బాలాజీ, ఉపాధ్యక్షుడు ఎస్ ఆంజనేయులు, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, బీసీ సెల్ అధ్యక్షుడు చిత్తరంజన్, కార్మిక ఉపాధ్యక్షుడు నాగేష్ నాయుడు, పూజారి అక్కులప్ప, క్రాంతి తదితర నాయకులు పాల్గొన్నారు.

## పొలం సర్వేచేసి తమను ఆదుకోవాలని తహశీల్దార్‌కు ఫిర్యాదు



శింగనమల,మేజర్ న్యూస్ : శింగనమల మండలంలోని నిదనవాడ గ్రామంలో తమ సొంత భూమిని సర్వేచేసి ఆన్ లైన్ లో నమోదు చేయాలని శింగనమల తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహిం చిన గ్రీవెన్స్ లో తహశీల్దార్ బ్రహ్మయ్య కు రైతు కుటుంబ సభ్యులు ఫిర్యాదు అందించారు.తమ పొలం సర్వే చేయ డానికి సర్వే అధికారులు వస్తే ప్రక్క పొలంవారు బెదిరింపులకు దిగుతు న్నారని తహశీల్దార్ కు విన్నవించారు.స్పందించిన తహశీల్దార్ బ్రహ్మయ్య నిదనవాడ గ్రామానికి చెందిన మహిళా రైతులు కృష్ణవేణి,పెద్దక్క ల పొలం సర్వే నెంబర్ 105/2ఏ లోని 2ఏకరాల 30 సెంట్లను సర్వేచేయాలని మండల సర్వేయర్ కు ఆదేశాల జారీ చేశారు.రెవెన్యూ అధికారులు రైతన్నల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తామని తెలియజేశారు.

## వేలాది మందితో మారుమోగిన గోవిందనామం

### కన్నుల పండువగా వెంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం

### ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, మాజీ ఎంపీ



కుందుర్పి, మేజర్ న్యూస్ : గోవిందా గోవిందా అంటూ వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణ మధ్య వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగ జరిగాయి. మండల కేంద్రమైన కుందుర్పి లో ప్రతి సంవత్సరం కన్నుల పండువగా జరిగే వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గత నాలుగు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఐదవ రోజు సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు బ్రహ్మీ ముహూర్తంలో బ్రహ్మ రథోత్స వం మడుగుతేరు కార్యక్రమం జరిగింది. వేలాది మంది భక్తులు కొంగుబంగా రంగా కొలిచే వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ నుండి వేలాదిమంది భక్తులు పాల్గొని గోవింద నామస్మరణ చేస్తూ వెంకటేశ్వరస్వామి రథాన్ని లాగారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళ్యాణదుర్గం శాసనసభ్యు లు అమిలినేని సురేందర్ బాబు, అనంతపురం పార్లమెంట్ మాజీఎంపీ తలారిరంగయ్య లు ముఖ్య అతిథులుగా వేరు వేరుగా పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఉదయం రథంగా హోమం, బలిహరణ్యం, గణపతిహోమం, స్వస్తి వచనాలతో ప్రారంభమైన రథోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేందర్ బాబు, సర్పంచ్ మారుతీశ్వరి రామమూర్తిలు రథాన్ని లాగి వారి, వారి మొక్కుబడు లను తీర్చుకొన్నారు. రాత్రి 11 గంటలకు జరిగిన రథోత్సవంలో భాగంగా స్థానిక రామాలయం నుండి మార్కెట్, సిండికేట్ బ్యాంక్, మీదుగా కరెంట్ ఆఫీస్ సర్కిల్ వరకు సాగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రవిశంకర్, పంచాయితీ కార్యదర్శి రఫిక్, మాజీ, తాజా ప్రజాప్రతినిధులు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కుందుర్పి ఎస్ఐ నగేష్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## సాయి విజ్ఞాన్ పాఠశాలలో వసంత పంచమి, అక్షరాభ్యాసం వేడుకలు..



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : అనంతపురం మూడవ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో శుద్ధ పంచమి రోజున వసంత పంచమి జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ ఎం.పి శ్రీనివాసులు, సి. కరుణాకర్ బాబు, పాఠ శాల ప్రధానోపాధ్యాయులు జి. లావణ్యారామ్ కార్యక్రమంలో పాలుపంచుకొని వారి చేతుల మీదుగా సరస్వతీ మాత పూజను జరిపి ఈ పవిత్రమైన రోజు విద్యార్థులకు మంచి జరగాలని కొత్తగా పాఠశాలకు వెళ్లే పిల్లలకు అక్షరాభ్యాసం చేసి ఆ సరస్వతీ దేవి ఆశీర్వాదాలు అందజేయాలని ఆ దేవిని దీప, ధూపాలతో ఎంతో ఘనంగా పూజ జరిపించడం కన్నుల విందుగా ఉంది. సరస్వతీ పూజ చేయడం వల్ల మనసు ఏకాగ్రతతో ఉంటుందని, చిన్నపిల్లలకు ఈరోజు అక్షరాభ్యాసం చేయడం వల్ల త్వరగా పురోగమిస్తారని ఈ సందర్భంగా అందరికీ వసంత పంచమి శుభాకాంక్షలతో పిల్లలకు తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ పూజలో ప్రత్యేకంగా పదవ తరగతి విద్యార్థు లు పాల్గొని ఆ తల్లి దీవెనలు అందుకున్నారు. ఈ ప్రత్యేక పర్వదినాన ఆ సరస్వతి దేవి బ్రహ్మ దేవుని నోటి నుండి పుట్టిందని, ఈ లోకానికి ఒక శబ్దం ఇచ్చిందని తెలియజేశారు. సరస్వతి దేవికి ఇష్టమైన నైవేద్యాలు మంత్ర పఠనం చేసి, ఆ సరస్వతి దేవి అనుగ్రహం అందరి మీద ఉండాలని ప్రార్థించారు. ఎంతోమంది తల్లిదండ్రులు వారి పిల్లలకు అక్షరాభ్యాసం చేసి, చివరిలో ఆ సరస్వతి దేవి కటాక్షం అందరి మీద ఉండాలని కోరుతూ పూలు, ఫలాలు టెంకాయలు అర్పించి తీర్థప్రసాదాలతో ముగించారు.

## వైభవంగా ముగిసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవిస్వర్ణోత్సవాలు



బెలుగుప్ప, మేజర్ న్యూస్ : బెలుగుప్ప శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో క్రోధినామ సంవత్సర మాఘ శుద్ధ షష్టి సోమవారం వేద పండితులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు మరియు నవగ్రహ హోమం, మహా పూర్ణహుతి నిర్వహించి, ఆర్యవైశ్య మహిళలు, యువతులు కలిసి గంగాజలమును కలశ లోతీసుకొని ఊరేగింపుగా దేవాలయానికి చేరుకుని పూజలు నిర్వహించి, భక్తుల నడుమ మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం మహా మంగళారతి తీర్థ ప్రసాద్వినియోగం నిర్వహించడంతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి స్వర్ణోత్సవాలు మరియు కుంభాభిషేకం ఘనంగా నిర్వహించడం జరిగింది. పూజలకు వచ్చినభక్తులకు, ఆర్యవైశ్య కుటుంబ సభ్యులకు భోజనము సౌకర్యం కల్పించారు. పూజా కార్యక్రమంలు చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు, ఆర్యవైశ్య కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీరంగనీతులు మానుకో !

# పెద్దారెడ్డి

▸▸ మొదటి పేజీ తరువాయి

ప్రజలే బుద్ధి చెప్పారు, మళ్లీ సాధారణ ఎన్నికల్లో బుద్ధి చెప్పారు. నీవు చేసిన అడ్డగోలు అక్రమాలే నీ రాజకీయ భవిష్యత్తుకు సమాధిగా మారాయనీ అన్నది గుర్తుపెట్టుకో. ఇక రాజకీయాల్లో నీ చాప్టర్ క్లోజ్ నీ అక్రమాస్తుల భరతం మా కూటమి ప్రభుత్వం సహకారంతో నీ అక్రమ ఆస్తులపై విచారణ చేపిస్తామని తాడిపత్రి మున్సిపల్ కౌన్సిలర్లు, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తాడిపత్రి పట్టణంలో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. పెద్దా రెడ్డి ఎమ్మెల్యే కాకముందు తిమ్మంపల్లిలో నీళ్లు కట్టుకుంటూ బ్రతికే వాడని. ఎమ్మెల్యే ఆయన తరువాత వందల ఎకరాల ఆస్తులు ఎలా సంపాదించవని ప్రశ్నించారు. అనతికాలంలోనే ప్రజాధనాన్ని లూటీ చేసి లగ్జరీ కార్లను కొన్నావు, పోలీసులను అడ్డంపెట్టుకొని ఇష్టాను సారంగా వ్యవహరించవని దుయ్యబట్టారు. తాడిపత్రికి నియోజకవర్గానికి చెందిన అనేకమంది తెలుగు దేశం పార్టీ నాయకులపై ప్రభోదనంద ఆశ్రమ కేసులలో అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపిన నీచ చరిత్ర నీది. నీవు నేడు నీతులు మాట్లాడడం హాస్యస్పదంగా ఉందని మండిపడ్డారు. మీ నీచ నికృష్టపు బుద్ధిని ప్రజలు పసిగట్టి 2022 మున్సిపల్ ఎన్నికలలో ఇంటికి పంపించారని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో డిఎస్పి చైతన్య, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి,ఎస్ఐ ఖాజా హుస్సేన్, ఎస్ఐ గౌస్‌లను నీయింట్లో పనిమనుషుల మాదిరిగా వాడుకొని తాడిపత్రిలో ఎన్నో అరాచకాలకు పాల్పడి తెలుగుదేశం నాయకుల మీద పిడి యాక్ట్, జిల్లా బహిష్కరణలు చేసింది అప్పుడే మరచిపోయావా పెద్దారెడ్డి అంటూ ఘాటుగా విమర్శించారు. కౌన్సిలర్ల మీద దాడులు మరియు మహిళా కౌన్సిలర్ల మీద 307 కేసులతో వారిని అనేక ఇబ్బందులకు గురిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. దళిత మహిళ కొంకరి కమలమ్మను అరెస్టు చేసి జైలుకు పంపిన నీచ సంస్కృతికి ఒడిగట్టారు. ఇప్పుడు నీ దాకా వచ్చేసరికి నీతులు గుర్తుకు వస్తున్నాయా అంటూ ప్రశ్నించారు. అప్పుడు చేసిన కర్మకు ఇప్పుడు అనుభవించాలి అంటూ మండిపడ్డారు.

నీ ప్రభుత్వంలో నిరకుశత్వంగా పనిచేసి తెలుగు దేశం కార్యకర్తలను నాయకులను వేదించి చిత్రా హింసలకు గురి చేసిన ప్రస్తుతం ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి అనంతపురం ఎస్ఓజి టీం లో పని చేస్తున్నాడు , ఎస్ఐ ఖాజా హుస్సైన్ విడపనకల్లు లో పనిచేస్తుండగా, ఎస్ఐ గౌస్ గార్లదిన్నే గా పనిచేస్తున్నాడు. మా ప్రభాకర్ రెడ్డి గారు కక్ష సాధింపు చేయాలి అనుకోని ఉంటే ఈ ముగ్గురు ఎస్ఐలు సర్వీస్ నుంచే తొలగించబడాలి. అనంతపురం



రేంజ్ డిఐజి, జిల్లా ఎస్.పి జగదీష్ గార్లకు మేము విజ్ఞప్తి చేసేది ఏమిటి అంటే వీరిని దయచేసి పోస్టింగ్ ఇవ్వవద్దని మనవి, అంతే కాకుండా వీరు గత ఐదు సంవత్సరాలు సంపాదించిన అక్రమార్జనలు మరియు నమోదు చేసిన అక్రమ కేసుల మీద విచారణ చేయాలని కోరుతున్నాము. తెలుగుదేశం నాయకులు ఎస్.వి.రవీం దా రెడ్డి (పొట్టి రవి) ని 5 సంవత్సరాల పాటు తాడిపత్రిలోకి అడుగు పెట్టనివ్వకుండా, ఆఖరికి జిల్లా కోర్ట్ మరియు హైకోర్ట్ ఆర్డర్ ఇచ్చినా కూడా భేకాతర్ చేస్తూ నీ ప్రభుత్వంలో ఉన్న పోలీస్ అధికారులతో బలవంతంగా అడ్డుకున్నావు. కేవలం 7 నెలలకే నీకు రాజ్యాంగం, నీతి వాఖ్యలు గుర్తుకు వస్తున్నాయి అంటే హాస్యాస్పదంగా ఉందని అన్నారు. జెసి ప్రభాకర్ రెడ్డి గారు తిమ్మనచెరువు వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం మరియు ఆలూరు కోన గ్రామాలకు వెళ్తుంటే పోలీసులను అడ్డం పెట్టుకుని వారిని అడ్డుకోవాలని చూసావని అయినా వెనక్కు తగ్గలేదని తెలిపారు. టిడ్కో ఇళ్ల వద్దకు పోవాలన్న, ఎల్లనూరు రోడ్డులో డ్రైనేజీ పనుల దగ్గరకు వెళ్లాలన్న పోలీసులను అడ్డుపెట్టుకొని హౌస్ అరెస్టులు చేసినా మేము మా నాయకుడు జెసి ప్రభాకర్ రెడ్డి గారు వెనక్కు తగ్గలేదని తెలిపారు. నువ్వు భయపెడితే ఇక్కడ ఎవరు భయపడరు అని హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా మాట్లాడి గొంతు నేడు మూగబోయిందా అంటూ ఎద్దేవా చేశారు. మీ కుమారులు హర్షవర్ధన్ రెడ్డి, సాయిప్రతాప్‌రెడ్డిలు ఏమయ్యారంటూ ప్రశ్నించారు. తాడిపత్రికి వచ్చి నీ కుమారులు ఇద్దరు వచ్చి ఉండవచ్చు కదా?కానీ వారిని మాత్రం కేసులకు భయపడి దూరంగా పెట్టావు. మీరు అధికారంలో ఉన్నప్పుడూ నీ కుమారులు అంబోతుల్లా పేట్రేగిపోయారు, ఇప్పుడు %AC% రూముల్లో కుక్కల్లాగా పడుకున్నారు , కానీ %YSRCP% కార్యకర్తలను మాత్రం బలి పశువులను చేయాలని చూస్తున్నావ్. వైయస్ఆర్సీపీ కార్యకర్తలారా మేము మీ జోలికి రావడం లేదని ఎవరి పనిని వారు చేసుకోవాలని ఇలాంటి నాయకులను నమ్ముకొని జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. తాము పెద్దారెడ్డి వెంట వెళ్తామంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి తెలుగుదేశం పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు కే.మల్లికార్జున, జె.విజయ్ కుమార్, శేక్షావలి,వారధి సురేష్, హుస్సైన్ బాష, జింక లక్ష్మీదేవి, రేష్మ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.



## ఐదేళ్లు గడుస్తున్నా పులకుర్తి ఉన్నత పాఠశాల భవన నిర్మాణాలు పూర్తయ్యేది ఎన్నడు?

### బేస్మెంట్ దశలోనే ఆగిపోయిన భవన నిర్మాణాలు

### కూటమి ప్రభుత్వంలోనైనా ముందుకు సాగేనా?

**డి. హీరేహాళ్ మేజర్ న్యూస్ :** మండలంలోని పులకుర్తి ఉన్నత పాఠశాల భవన నిర్మాణాలు అర్ధాంతరంగా ఐదేళ్లుగా ఆగిపోయాయి. 2020 – 2021 నాడు నేడు కింద 5 అదనపు గదుల నిర్మాణాలకు మరుగుదొడ్లకు, ఇతర సామాగ్రికే సంబంధించిన భవనాలు రూ. 70 లక్షల మేర మంజూరయ్యాయి. అయితే గత ఐదేళ్లుగా బేస్మెంట్ కే పరిమి తమైంది. పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు దాదాపుగా 170 మంది వరకు విద్యను అభ్యాసిస్తు న్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు గదులు లేక అగచాట్లు తప్పడం లేదు. పాఠశాల ఆవరణంలోనే చెట్ల కింద విద్యాభ్యాసం ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. గదుల కొరతతో తీవ్ర ఇబ్బందులకు కింద కూర్చుంటూ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా ఉన్నత పాఠశాల భవన నిర్మాణాలు గత ఐదు సంవత్సరాలుగా ఇలాగే బేస్మెంట్ దశలో ఉంటే విద్యార్థులు కింద కూర్చుని విద్యను అభ్యసించాల్సిన దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా పనులు ప్రారంభిస్తారని ఆశతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల నిర్లక్ష్యం వీడి పాఠశాల భవన నిర్మాణాలు పూర్తి చెయ్యాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై హెచ్ఎం మరియమ్మ ను అడగగా ఈ తతంగమంతా వాస్తవమేనని, త్వరలోనే పై అధికారులు దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభించే దిశగా చర్యలు చేపడతామన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం...

### నూతన రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే అలిమినేని



**కుందుర్పి, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ ప్రజల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తానని కళ్యాణదుర్గం శాసనసభ్యులు సురేందర్ బాబు తెలియజేశారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మండల కేంద్రమైన కుందుర్పిలో రెండు కోట్లు పైచిలుకు నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డుల ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న తాను రాబోయే కాలంలో అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ధనుంజయ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాఘవేంద్రబాబు, మల్లికార్జున పెద్దనరసింహప్ప, మాజీ కోఆప్షన్ తహీర్ భాషా, మాజీ, తాజా ప్రజాప్రతినిధులు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం




**రాయదుర్గం, మేజర్ న్యూస్:** గర్భస్థ పిండ లింగనిర్ధారణ చట్టరీ త్యా నేరమని మలేరి యా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. స్వచ్ఛ రాయదుర్గం, స్వస్థ్య రాయదుర్గం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కోట ఏరియా 13వ సచివాలయ పరిధిలో సోమవారం బేటీ బచావో, బేటీ పడావో మరియు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో లింగ వివక్ష మరియు మహిళా సాధికారత కోసం భారత ప్రభుత్వం బేటీ బచావో, బేటీ బడావో పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. బాలికల సంక్షేమ సేవల సామర్థ్యాన్ని మెరుగు పరచడం ఈ పథకం ముఖ్య లక్ష్యం అన్నారు. ప్రతి బాలి కా విద్య పై దృష్టి సారించి విద్యావంతురాలు కావాలన్నారు. అలాగే బాల్య వివాహాలు చేయరాదని, అందవల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ శాంతకుమారి, శానిటేషన్ సెక్రటరీ లక్ష్మీ నరసమ్మ, హెల్త్ సెక్రటరీలు అరుణ, సునీత, సుజాత, శైలజ, ఆశా కార్యకర్తలు లక్ష్మీ దేవి, సునీత, సుబ్బలక్ష్మి, స్వాతి,శారద పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య

**అనంతపురం బ్యూరో మేజర్ న్యూస్ :** నగరంలోని నాలుగవ రోడ్డుకు చెందిన రంజిత అనే వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శ్యామ్ అదెలా సాధ్యం..!?

▸▸ మొదటి పేజీ తరువాయి

శ్యాం విద్యార్థులు 310 మంది సెలెక్ట్ కావడం నిజంగానే ఆ మెటీరియల్ పుస్తకం చూసిన ఎవరికైనా దిమ్మతిరిగి బొమ్మ కనపడాల్సిందే. అలా ఉంది శ్యామ్ మన ఇన్స్టిట్యూట్ ప్రచురించిన ఆ పుస్తకం ఒక అభ్యర్థి విశ్వాసం ఒక ఉద్యోగం కేవలం 6 నెలల వ్యవధిలోనే మీరు ఓ పోలీస్ ఆఫీసర్ నిరుద్యోగులను ప్రభుత్వ ఉద్యోగ కర్మాగారం లా మార్చుకున్న మీ ఇన్స్టిట్యూట్‌కు తరలిస్తున్నారని తెలిసింది. తీగ లాగితే ఎక్కడెక్కడో కదులుతున్న విజయ డొంక ఆ పుస్తకానికి చీఫ్ఎడిటర్ గా బి.శైలజా శామ్. శ్యామ్ ఇన్స్టిట్యూట్ కేర్ ఆఫ్ కాకినాడ. అయితే ప్రస్తుతం అనంతలో ఆ కానిస్టేబుల్ ఉద్యోగాల నిరుద్యోగులే టార్గెట్‌గా పాగా వేసేందుకు కసరత్తులు ప్రారంభించారని అత్యంత విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగానే అనంత జిల్లాలో పలువురు పోలీసు అధికారుల చేత ఆ పుస్తకాలు విడుదల చేయించారని సమాచారం. మాకు అందిన ఆ సమాచారం మేరకు ఇందులో మీకు లాభం ఎంత. మీ ఇన్స్టిట్యూట్ కు శిక్షణ నిమిత్తం వచ్చే నిరుద్యోగులతో కమిట్మెంట్ ఏమైనా ఉందా, ఆ ఆరు నెలల శిక్షణకు ఫీజు ఎంత, ఉద్యోగాలు పొందిన ఆ నిరుద్యోగ అభ్యర్థులతో ఆ తర్వాత కూడా ఏమైనా కమిట్మెంట్ ఉందా,?ఇటీవల మీరు ఆన్లైన్ యూట్యూబ్ ను కేవలం మీ పబ్లిసిటీ కోసం ఏమైనా కొనుగోలు చేశారా, గతంలో మీరిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులా?,

### ఇక్కడ అందరికీ ఆశ్చర్యం కలిగే మరో విషయానికొస్తే..

ఆ పుస్తకంలో ప్రచురించిన ముందుమాటలోని ఆ అక్షరాలు ఒకసారి ఎవరు పరిశీలించినా అవాక్కవడం తథ్యం. అందులో ఏముందంటే యాపిల్ సంస్థ ప్రపంచ దిగ్గజ కంపెనీల్లో ఒకటిగా ఎదగడానికి 40 సంవత్సరాలు సమయం పట్టిందని, అమెజాన్ సంస్థ ప్రస్తుత స్థాయికి చేరుకోవడం వెనుక పాతికేళ్ల శ్రమ ఉందని ఇలా ఆ సంస్థలను పొగుడుతున్నాడో, లేక ఆయనకు ఆయనే ఆరు నెలల్లోనే పైనంత శ్రమ లేకుండా ఉద్యోగాలు పొందవచ్చు అని కించపరుస్తున్నాడో అర్థం కావడం లేదు. సమకాలిక అంశాలతో 100% మార్కులు శ్యామ్ ఎలా సాధ్యం. ఆ విజయ డొంకను అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా 'మేజర్ న్యూస్' నేటి దినపత్రిక సూర్య బృందం కదిలించే ప్రయత్నం చేస్తుందని సవినయంగా పాఠకులకు, నిరుద్యోగులకు మరో కథనంలో ఆ విషయాలన్నిటినీ తెలియజేస్తామని తెలుపు తున్నాము.

## రోడ్డు భద్రత నిబంధనలు

# ప్రతి ఒక్కరూ పాటించాలి

### - కూడేరు సీఐ రాజు



**కూడేరు, మేజర్ న్యూస్ :** కూడేరు మండల కేంద్రంలో సీఐ రాజు సోమవారం వాహనాలు విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ రాజు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతీ ఒక్కరూ పాటించాలని వాహన చోదకులను పోలీసులు కోరారు. జిల్లా ఎస్పీ పి జగదీష్ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనల అమలుపై దృష్టి సారించామని తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్టు ధరించని వారిపై త్రిబుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, తదితర ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నాము అని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజుతో పాటు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## తొండపాడులో టెంకాయల వేలం

గుత్తి, మేజర్ న్యూస్ : మండలంలోని తొండుపాడు గ్రామంలో వేలసిన శ్రీ బొలికొండ రంగనాధ స్వామి అలయంలో సోమవారం టెంకాయిల వేలం నిర్వహించారు.. దేవదాయ శాఖ ఆధికారి రాణి ఈఓ రామాంజినేయులు మాజీ అలయ కమిటీ చైర్మన్ రంగస్వామి రెడ్డి ఆద్వర్యంలో బ్రహ్మోత్సవాలు, సంవత్సరం టెంకాయిల విక్రయాలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో నాలుగురు డిపాజిట్ చేల్లించారు. ఈ నేల 6వ తేది నుండి 14 వతేది వరకు జరిగే రంగనాధ స్వామి బ్రహ్మోత్సవాల్లో టెంకాయిల విక్రయాల కు రఘునాధరెడ్డి రూ.3లక్షల 5వేలకు వేలం దక్కించుకొగా సంవత్సరం పాటు టెంకాయిల విక్రయాల చేసేందుకు రూ.6లక్షల 50వేలకు వేలాన్ని బీరప్ప దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆధికారులు మాట్లాడుతూ నిబంధనలు ప్రకారం టెంకాయిల విక్రయాలు చేయాలన్నారు. అధిక ధరలకు విక్రయాలు చేస్తే వారి వేలాన్ని రద్ద చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిన్నరెడ్డి యాదవ్, మద్దిలేటి, సిబ్బంది రామకృష్ణ, బాలు గ్రామస్తులు పాల్గొన్నారు.



## మున్సిపల్ చైర్మన్ సీటు టిడిపి కైవసం

▸▸ మొదటి పేజీ తరువాయి

తొలుత టీడీపీ ద్వారా 6వ వార్డ్ కౌన్సిలర్ డి.ఈ.రమేష్ కుమార్ ను మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేయగా వెనువెంటనే తోటి కౌన్సిలర్లు ప్రతిపాదించారు.వెంటనే 21 మంది కౌన్సిలర్లు,ఎంపీ ఎమ్మెల్యే తమ ఓటు హక్కును వినియోగించుకోవడం తో డి.ఈ.రమేష్ కుమార్ చైర్మన్గా విజయం సాధించారు. మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన రమేష్ కుమార్ కు అధికారులు డిక్లరేషన్ ఫారం అందజేశారు .చైర్మన్గా గెలుపొందిన డిఈ రమేష్ కుమార్ కు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎంపీ పార్ధసారథి శుభాకాంక్షలు చెప్పి అభినందించారు. అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన డి.ఈ. రమేష్ కుమార్ కు పలువురు కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు అభినందిస్తూ గజమాలలు వేసి, పుష్పగుచ్చాలని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ప్రజా సంక్షేమానికి, ప్రజాభివృద్ధికి జరిగిన ఎన్నికలని మున్సిపల్ అభివృద్ధి కోసం పలువురు కౌన్సిలర్లు టిడిపి చైర్మన్కి ఓటు వేసి గెలిపించడం జరిగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో మున్సిపల్ అభివృద్ధి ఏమాత్రం జరగలేదని ప్రస్తుతం చైర్మన్గా ఎంపికైన డి ఈ రమేష్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అన్ని విధాల



అభివృద్ధి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వ అధి కారంలోకి వచ్చిన వెంటనే హిందూపూర్ మున్సిపల్ అభివృద్ధి కోసం లక్షలాది రూపాయలు విడుదల చేయడం జరిగిందని రాబోవు రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. చైర్మన్గా విజయం సాధించిన డి ఈ రమేష్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహాయ సహకారాలతో తోటి కౌన్సిలర్ల ఆశీస్సులతో మున్సిపల్ చైర్మన్గా గెలుపొందడం చాలా సంతోషంగా ఉందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల ప్రోత్సాహంతో కౌన్సిలర్ల సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానని తెలిపారు.





**ఉద్యాన రైతులకు అత్యద్భుత అవకాశం...**

**రేపటి హార్టికల్చర్ కాంక్లెవ్ అనంత చరిత్రలో ఓ సువర్ణ అధ్యాయం...**

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో స్వర్ణ అనంత దిశగా అడుగులు వేస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్..**

**ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ...**

**జిల్లా ఇన్చార్జి మంత్రి టీజీ భరత్ సంకల్పిస్తేనే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు సాధ్యం..**

**కష్ట కాలంలో ప్రాసెసింగ్ యూనిట్ లే ఉద్యాన రైతులకు వెన్నుదన్ను..**

# అనంత టు అంతర్జాతీయం..





ప్రతికూల పరిస్థితులనే అనుకూలంగా మలుచుకుని అంతర్జాతీయ స్థాయి పండ్లను పండిస్తున్నారు అనంత ఉద్యానవన రైతులు. దేశంలోనే అత్యల్ప వర్షపాతం కలిగిన రెండవ జిల్లా అయిన అనంత.. ఆంధ్ర ప్రదేశ్ కే కాదు భవిష్యత్తులో భారతదేశానికి కూడా ఫ్రూట్ బౌల్ అవుతుందన్నడంలో అతిశయోక్తి లేదు. ఔను... అనంత నేలే ఇందుకు ప్రబల సాక్ష్యం. ఇక్కడి వాతావరణం.. నేల పట్టుత్వం... చుక్క చుక్క నీటిని కూడా ఒడిసిపట్టే ఉద్యాన రైతుల అవిరాల కృషి అనంత పండ్లను అంతర్జాతీయ స్థాయికి చేరుస్తున్నాయి. ఢిల్లీలో కర్బూజా తింటున్నారంటే అది అనంత ఉద్యాన రైతుల చలువే. మిడిల్ ఆసియా దేశాలకు అరటి రవాణా చేసే స్థాయికి ఎదిగాం. ఇక్కడి అరటి, బత్తాయి, టమోటా, కర్బూజా, మామిడి పండ్లకు గ్లోబల్ స్థాయిలో గుర్తింపు ఉంది. వీటికి ఎండు మిరప అదనం. అనంతపురం జిల్లా గ్రాస్ వాల్యూ లో 45 శాతం వాటా ఒక్క ఉద్యాన ఉత్పత్తుల ద్వారానే వస్తోంది. ఇది రాష్ట్ర జి ఎస్ డి పి లో 11.73 శాతంగా ఉండడం విశేషం.

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో స్వర్ణ అనంత దిశగా జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అడుగులు..**



అవకాశాలు ఎక్కడ ఉన్నా అందిపుచ్చుకునే విజన్ కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటినుండో అనంతపురం జిల్లాను ఫ్రూట్ బౌల్ గా సంబోధిస్తూ వస్తున్న విషయం విధితమే. సీఎం చంద్రబాబు విజన్ కు అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ డెడికేషన్ తోడవడం అనంత ఉద్యాన రైతుల పాలిట వరంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ కు వాస్తవరూపం ఇవ్వాలన్న సంకల్పంతో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఎంతో కసరత్తు చేశారు. ఇందుకు రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక వాణిజ్య పన్నుల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సహకారం తోడవడం మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. దీంతో అగ్రికల్చర్ హార్టికల్చర్ రైతులతో కలిసి గ్రౌండ్ వర్క్ రిపోర్ట్ తెప్పించుకున్నారు. నిష్ణాతులైన వ్యవసాయ ఉద్యాన శాస్త్రవేత్తలతో చర్చోప చర్చలు జరిపారు. గ్లోబల్ గుర్తింపు డిమాండ్ కలిగిన పండ్ల రకాలను లిస్ట్ అవుట్ చేసి



ఫైనలైజ్ చేశారు. తద్వారా 5 గ్రోత్ ఇంజన్లు గా కర్బూజా, మామిడి, బత్తాయి, అరటి, టమోటా పండ్ల రకాలను గుర్తించారు. వీటితోపాటు మిగిలిన పండ్లకు కూడా జాతీయస్థాయి గుర్తింపు, డిమాండ్ కలిగే విధంగా బుధవారం అనంతపురం ఎం వై ఆర్ కన్వెన్షన్ హాల్ వేదికగా అనంత ఉద్యాన సమ్మేళన కార్యక్రమానికి అంకురార్పణ చేయనున్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయి లో 64 కంపెనీలు రానున్నాయి. ఇప్పటికే 6 ఎంఓయూ లు కుదుర్చుకునేందుకు అంగీకారం తెలపగా.. ఈ సంఖ్య మరింత పెంచేదిశగా జిల్లా కలెక్టర్ కృషి చేస్తుండడం విశేషం. రానున్న ఏడాదిలో ప్రస్తుతమున్న ఉద్యాన పండ్ల తోటల సాగు విస్తీర్ణానికి మించి 25 వేల హెక్టార్ల లో సాగు లక్ష్యంగా ముందుకు కదులుతున్నారు.

**ప్రాసెసింగ్ యూనిట్లపై దృష్టి సారిస్తే మరింత ఉపయోగం..**

పండ్ల తోటల సాగులోనే కాదు మేలిమి రకాలైన పండ్లను పండించడంలో కూడా అనంత రైతులు అగ్రగన్యులే. అయితే అదే సందర్భంలో టమోటా, మామిడి, బత్తాయి వంటి పండ్ల దిగుబడి అధికంగా వచ్చిన నేపథ్యంలో గిట్టుబాటు ధరలు లేక వచ్చిన కాటికి అమ్ముకోవడమో లేక రవాణా చార్జీలు కూడా చేతికి రాక రోడ్లపాలు చేసిన సందర్భాలూ లేకపోలేదు. రాయలసీమలోని మదనపల్లి తర్వాత రెండవ అతిపెద్ద టమోటా మండి అనంతపురం జిల్లాలోనే ఉంది. అయితే అనంతపురం జిల్లాలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ లేకపోవడం ఇక్కడి రైతులకు ఎప్పటికీ లోటుగానే మిగిలిపోతుంది. ఆ మాటకొస్తే తీవ్ర నష్టాలను సైతం మిగులుస్తోంది. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించి టమోటా, మామిడి, బత్తాయి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పితే 25 వేల హెక్టార్ల అదనపు సాగు విస్తీర్ణ లక్ష్యాన్ని అందుకోవడం పెద్ద కష్టమేమి కాదు. మరి అనంత జిల్లాలో పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన సాధ్యమేనా..?

**జిల్లా ఇన్చార్జ్ మంత్రి టీజీ భరతే.. ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కావడం అనంత రైతులకు కలిసొచ్చే అంశం.**

అనంతపురం జిల్లా ఇన్చార్జ్ మంత్రిగా ఉన్న టీజీ భరతే రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రిగా కూడా ఉండడం అనంత రైతులకు కలిసొచ్చే అంశం. అనంత జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్ప డం ద్వారా ఇక్కడి ఉద్యాన రైతులకు లబ్ధి చేకూర్చడం తో పాటు స్థానికంగా ఉపాధి, మార్కెటింగ్ అవకాశాలు కూడా పెంపొందించినట్లు అవుతుంది. అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ వంటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లా ఇన్చార్జి శాఖ మంత్రి టీజీ భరత్ ప్రత్యక్షంగా పాల్గొనక పోయినా.. వర్చువల్ గా అయిన పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు చేస్తామని తీపి కబురు చెబుతారా..? అంతర్జాతీయ స్థాయి గ్రేడింగ్ పండ్లను పండించే అనంత ఉద్యాన రైతుల అభిలాష నెరవేరుస్తారా..? కష్ట కాలంలో ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా వెన్నుదన్నుగా నిలుస్తారా..?



**అనంతపురం మేజర్ న్యూస్ ప్రతినిధి...**

## రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న వెంకటేష్ నాయక్‌కు సన్మానం



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురంలో డిల్లీ రిపబ్లిక్ పేరేడే క్యాంపుకు ఎంపికైన విద్యార్థి ఎస్. వెంకటేష్ నాయక్ జనవరి 26 వ తేదిన డిల్లి లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎదుట కర్తవ్య పథ్ లో రిపబ్లిక్ డే పేరేడే లో పాల్గొన్నారు. ఎస్. వెంకటేష్ నాయక్ దేశ వ్యాప్తంగా 40 లక్షలు మంది ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు ఉండి అందులో 200 మంది వాలంటీర్లకు మాత్రమే రిపబ్లిక్ పెరేడ్ కు పాల్గొనే అవకాశం ఉంటుంది. అందులో ఎస్. వెంకటేష్ నాయక్ ఉండడం కళాశాలకు గర్వ కారణం అని హెచ్ఓడి తెలిపారు. ఎస్. వెంకటేష్ నాయక్ జేఎన్టీయూఏ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి. ఈ సందర్భంగా అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం వారు ఎస్. వెంకటేష్ నాయక్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ నాయక్ను అబినందిస్తూ ఇంచార్జ్ ఉపకులపతి ఆచార్య హెచ్. సుదర్శన రావు తో పాటు రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. కృష్ణయ్య, ఉపకులపతి ఓఎస్డి ఆచార్య ఎన్. దేవన్న, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ జి. మమత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్. శారద పాల్గొని అబినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. మమత, ఆచార్య వి. సుమలత , ఆచార్య రమణ రెడ్డి , ఆచార్య చంద్ర మోహన్ రెడ్డి , మాజీ ఆచార్యులు గిరి ప్రసాద్, డాక్టర్ ఎస్. అరుణ మస్తాని విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశంలో పాల్గొన్న వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర మేజర్ న్యూస్:హిందూపురం మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉష్రశ్రీ చరణ్ ఆదేశాల మేరకు , హిందూపురం సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో హిందూపురం పార్టీ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశంలో పాల్గొన్న మడకశిర నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎస్,ఎల్,ఈరలకప్ప..ఆయనతో పాటు కుంచిటి గా,వక్కలిగ కార్పొరేషన్ అధ్యక్షులు రంగేగౌడ్,సత్యసాయి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు,జమ్మానిపల్లి నరసింహమూర్తి,జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సత్యనారాయణ , మల్లేష్, ఇతర వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యారణ్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా అక్షరాభ్యాసం



హిందూపురం మేజర్ న్యూస్:- విద్యారణ్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు వసంత పంచమి సందర్భంగా హెూమము లు నిర్వహించి, 51 మంది పిల్లలకు అక్షరాభ్యాసం చేయడం జరిగి నది. ఈ కార్యక్రమము రాధాకృష్ణ, సత్య సాయి జిల్లా కార్యదర్శి సరస్వతీ విద్యా మందిరము వారి ఆధ్వర్యంలో విద్యారణ్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ కార్యదర్శి జయ ప్రకాష్, సహాయ కార్యదర్శి బద్రీనాథ్, ప్రబంధ కారి ని సభ్యులు దేవాంగం శంకరప్ప, శ్రీనివాసులు, దేవాంగం రవికుమార్, నవిత, తిరుమలేష్ తల్లిదండ్రులు ,కుటుంబ సభ్యులు హాజరైనారు. తదుపరి సరస్వతి మాతకు పూజ నిర్వహించి ప్రసాద వితరణ జరిగినది.

## నాకు పద్మభూషణ్ కాదు.. నాన్నకు భారతరత్న రావాలి

### - ఎమ్మెల్యే పద్మభూషణ్ బాలకృష్ణ



హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురంలో ఎమ్మెల్యే నందమూరి పద్మభూషణ్ బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటించడం నాకు చాలా సంతోషంగా ఉందని, అయితే మహెూన్నత వ్యక్తి ఎన్టీఆర్ నందమూరి తారకరామారావుకి భారతరత్న అవార్డు రావాలని, అదే కోట్లాదిమంది తెలుగు ప్రజల కోరిక అని అన్నారు. నేను కూడా నాన్నకు భారతరత్న రావాలని భావిస్తున్నానన్నారు.

## భోగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



పామిడి, మేజర్ న్యూస్ : పట్టణంలోని భోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం మొదటి సోమవారంను పురస్కరిం చుకొని వేకువజామున నుంచే స్వామి వారికి విశేష పూజలు చేపట్టారు. పంచామృ తాభిషేకాలు, ఏకవార రుద్రాభిషేకాలు, అర్చనలు అనంతరం స్వామి వారిని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలా డింది. శివనామ స్మరణతో మారుమ్రోగింది. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంచిపెట్టారు..

# ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి సంపూర్ణ సహకారం

### - "లక్ష డప్పులు - వేల గొంతులు" వాల్ పోస్టర్ల విడుదలలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్ :** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన "లక్షల డప్పులు - వేల గొంతులు" కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం అనంతపురంలోని ఆర్ అండ్‌బి అతిథి గృహంలో మడకశిర ఎమ్మెల్యే , టిటిడి బోర్డు మెంబర్ ఎమ్మెస్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాష్ట్రంలో తప్పనిసరిగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు కట్టుబడి ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిగల ఉద్యమానికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని అన్నారు. ఫిబ్రవరి 7న జరుగు ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి వ్యక్తిగతంగా తమ వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లప్పగారి గంగాధర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్నాథ్, ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షుడు బండారు కదరప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరి గోపాల్, ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమంతరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు చంద్రశేఖర్, మాదిగ యువసేన జిల్లా అధ్యక్షుడు బాణాసి శీన, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు మన్నెపాకుల రమేష్, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, కోశాధికారి దేవరపుల్లన్న, ఎంఎస్పి నేత మంజు, ఎమ్మార్పీఎస్ నేతలు శింగనమల ఓబులేసు, వెంకటాపురం నరసింహులు, వెంకటాపురం నాగేంద్ర, ఎంఈఎఫ్ నేతలు క్రిష్టప్ప, మీసాల నాగభూషణం, నారాయణస్వామి, రామ్మూర్తి, ఎగ్గిడి రామన్న తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో క్లైమేట్ కేర్ ఛాంపియన్స్ ప్రోగ్రామ్




**అనంతపురం బ్యూరో మేజర్ న్యూస్ :** జాతీయ ఆరోగ్య మిషన్, స్వస్తి , గ్లోబల్ కన్సార్టియం ఆన్ క్లైమేట్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అనంతపురం జిల్లాలో క్లైమేట్ కేర్ ఛాంపియన్స్ ప్రోగ్రామ్ సంయుక్తంగా విపరీతమైన వేడి యొక్క ఆరోగ్య ప్రభావాలను పరిష్కరించడానికి ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరిగినది జిల్లాలో గల వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేయుచున్న కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లకు, ఫిబ్రవరి 3-4, 2025 మరియు ఫిబ్రవరి 6-7-2025 తేదీలలో ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ ) వర్క్‌షాప్ నిర్వహించబడుతోంది. సుమారు 80 మధ్య స్థాయి ఆరోగ్య ప్రదాతలు మరియు సహాయక నర్స్ మిడ్‌వైవ్‌లు జిల్లా నుంచి పాల్గొంటారు. ఈ శిక్షణ పొందిన ఆరోగ్య సంరక్షణ నిపుణులు, గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్తలు అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు అదనపులతో సహా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు శిక్షణను అందజేస్తారు, తీవ్రమైన వేడి-సంబంధిత ఆరోగ్య ప్రమాదాల నుండి సమాజ రక్షణ చర్యలు నేర్పిస్తారు. డా ఇ.బి.దేవి, జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారిణి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వాతావరణ మార్పులు గమనించి, వాతావరణ సంక్షోభంలో వేడికి సంబంధించిన హీట్‌వేవ్‌లు, హీట్ ఇండెక్స్, గ్రీన్‌హౌస్ గ్యాస్ ఎఫెక్ట్, అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్ , బిల్ట్ ఎన్విరాన్‌మెంట్ పాత్ర గురించి తెలియజేసారు. అలాగే డా. నారాయణ స్వామి, జిల్లా కార్యక్రమ అధికారి మాట్లాడు తూ, మారుతున్న వాతావరణ పరిస్థితితుల అనుగుణంగా రక్షణ అవసరము అని తెలియజేసారు. ఈ శిక్షణా కార్యక్రమానికి నిమిషా హెర్రెరా నిమ్మగడ్డ, లీడ్, వాతావరణం, ఆరోగ్యం (స్వస్తి), వేదిక టి, టెక్నికల్ స్పెషలిస్ట్ (స్వస్తి), తన్మయి, ప్రోగ్రామ్ అసోసియేట్ (స్వస్తి), పవిత్ర, ఎవిడెన్స్ స్పెషలిస్ట్ (స్వస్తి), డేనియల్ డి పైవా సీనియర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ , డాక్టర్ కేటీ, ఎమర్జెన్సీ మెడిసిన్ ఫిజిషియన్ , ప్రోగ్రామ్ మేనేజర్ , హన్నా వైన్‌స్టెయిన్, ఫెలో, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ ఈ ఓ గంగాధర్, జి.ఆంజనేయులు, ఫ్లోరోసిస్, బి. ప్రేమ్, శ్రీరాములు, మౌనిక, శశి, కిషోర్ ఎన్‌సిడి పాల్గొన్నారు.

# రాష్ట్ర రహదారులను నేషనల్ హైవేకి అనుసంధానం చేస్తున్నాం

### - తాడిపత్రికి రూ.11కోట్లు కేటాయించాం - రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

### - నిధులు కేటాయించడంతో ధన్యవాదాలు తెలిపిన మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి



**తాడిపత్రి మేజర్ న్యూస్:** రాష్ట్ర రహదారులను నేషనల్ హైవే కి అనుసంధానం చేస్తున్నామని రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. తాడిపత్రి పట్టణంలోని జేసీ నివాసం నందు సోమవారం మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డిని రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే మాజీ మంత్రి జెసి దివాకర్ రెడ్డిని పలకరిస్తూ ఆరోగ్య యోగక్షేమలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన జెసి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో నిర్వీరమైన వ్యవస్థలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో పునర్ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు.గుంతలమయమైన రహదారులను రూ.1061 కోట్లతో మరమ్మతులు చేపట్టామని చెప్పారు. అనంతపురం జిల్లాకు రహదారుల అభివృద్ధి కోసం రూ. 24 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే కేవలం తాడిపత్రి కి



మాత్రం ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి ల విజ్ఞప్తి మేరకు రూ. 11 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రూ. 11కోట్లు నిధులు కేటాయించడం చాలా సంతోషకరమని తెలియజేశారు. నాపరాతి పరిశ్రమకు సంబంధించి గనుల యజమానులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను జేసీ ప్రభాకర్ రెడ్డి తీసుకురావడం జరిగింది. అలాగే నాపరాతి పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి.. ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి ఆయా సమస్యలను తీసుకెళ్లామని.. త్వరలో నాపరాతి పరిశ్రమ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కందిపంట అగ్నికి ఆహుతి



పుట్టపర్తి రూరల్ మేజర్ న్యూస్ : పుట్టపర్తి మండలం బొంతలపల్లి గ్రామ పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడం వల్ల కంది పంట అగ్నికి ఆహుతి అయిన ఘటన వెలుగు చూసింది. సోమవారం రైతు కేశవయ్య మాట్లాడుతూ, తాను 1.30 సెంట్లు కంది పంట వేశానని అయితే చేతికి అందే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడం వల్ల కంది పంట పూర్తిగా కాలిపోయిందన్నారు. అదేవిధంగా సమీపంలో ఉన్న పశువులకు నిలువ చేసి ఉన్న గడ్డివామి సైతం కాలిపోయి బూడిదైందని పేర్కొన్నారు. మొత్తం మీద 60 నుంచి 70 వేల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. సంబంధిత అధికారులు ఆదుకోవాలని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

## కంచెను ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు



కదిరి రూరల్, మేజర్‌న్యూస్ : కదిరి రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచా యతీలో కదిరి పట్టణానికి చెందిన ఖాదర్‌బాషా పొలం చుట్టూ సిమెంటు కప్పులు, ఇనుక కంచెను ఏర్పాటు చేసుకోగా, గుర్తు తెలియని వ్యక్తులు కంచెను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఇదే విషయమై కదిరి రూరల్ పోలీస్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడు ఖాదర్‌బాషా తెలిపిన మేరకు తనకు కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలో సర్వే నెంబరు 705లో 4.49 ఎకరాల్లో తనకు 1.12ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. తనకు సంబందించిన పొలంలో కొంత స్థలాన్ని విక్రయించామని, ఆపై పొలం చుట్టూ పిన్సింగ్ వేయడం జరిగిందన్నారు. జనవరి 30వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప కంచెను తొలగించడంతో పాటు 40 సిమెంటు కప్పులను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. తన వద్ద భూమి కొనుగోలు చేసిన వ్యక్తులకు టి. సలీం ఆయన కుమారుడు టి. వాసీం పోన్ చేసి బెదిరిస్తున్నారని, ఆ భూమిని కొంటే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని సీఐను కోరినట్లు తెలిపారు.

## గృహప్రవేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే..



అమరాపురం మేజర్ న్యూస్: మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం నిద్రగట్ట పంచాయతీలో గల యర్రగుంట హళ్లి గ్రామంలో జరిగిన నూతన గృహప్ర వేశానికి హాజరై ప్రత్యేక పూజ కార్యక్ర మంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ మాజీ శాసనసభ్యులు మద్దనకుంట ఈరన్న ఆయనతో పాటు హిందూపురం పార్లమెంట్ కుంచితిగా అధ్యక్షులు బిఎల్ఆర్, వీరక్యాత రాయ, బుజ్జి, సిద్ధప్ప, రంగప్ప, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఏఓ



శింగనమల,మేజర్ న్యూస్ : శింగనమల మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి అన్వేష్ కుమార్ తెలియజేశారు. ఖరీఫ్ లో కంది సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రాలలో కొనుగోలు కొరకు రిజిష్టర్ చేసుకున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. క్వింటా 7550 రూపాయలతో కొనుగోలు చేయటం జరుగుతుందని తెలియజేశారు. రైతులు షాంఫిల్ తీసుకొని వచ్చి మార్క్‌ఫెడ్ సిబ్బంది శివారెడ్డిని సంప్రదించాలని కోరారు. శింగనమలలో గోవిందరాయుని పేట రహదారి ప్రక్కన గల గోడాన్ వద్ద కొనుగోలు కేంద్రం ఎర్పాటు చేశామని తెలిపారు. మండలంలో ఇప్పటివరకు రైతుసేవా కేంద్రాల ద్వారా 122 మంది రైతులు 955 క్వింటాల్ కందులు కొనుగోలుకు రిజిష్టర్ చేసుకున్నారని తెలిపారు.

## తొక్కిసలాటలో గాయపడ్డ బాధితురాలికి ఆర్థిక సాయం



రొళ్ల మేజర్ న్యూస్:టీటీడీ వైకుంఠ ద్వారం దర్శన టికెట్ల వినియోగ కేంద్రం వద్ద జరిగిన తొక్కిస లాటలో తీవ్రంగా గాయపడిన బాధితురాలికి తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు మరియు మడకశిర నియోజకవర్గ శాసనసభ్యులు అయినా ఎమ్మెస్ రాజు అనంతపురం పట్టణంలోని తన స్వగృహం నందు గాయపడ్డ బాధితురాలు బళ్లారికి చెందిన దుర్గమ్మకు రెండు లక్షల విలువచేసే చెక్కును ఆయన అందించారు తమకు ఆదుకుని సహాయాన్ని అందించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి మరియు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు బాధితురాలు వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తాం



**పుట్టపర్తి రూరల్ మేజర్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవాన్ని తేవడానికి అందరితో కలిసి ముందుకు వెళ్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటా సత్యం పేర్కొన్నారు. సోమవారం కోట గార్డెన్ వద్ద ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతపురం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోట సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్ర కలిగినదని, ఈ దేశానికైనా, రాష్ట్రానికైనా న్యాయం జరిగిందంటే ఒక్క కాంగ్రెస్ పార్టీ వలనేనని, రాబోవు రోజుల్లో కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం అనంతపురం అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ చాలామంది కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి సుముఖంగా ఉన్నారని వారందరినీ కలుపుకొని పార్టీకి పూర్వ వైభవం తేవడానికి అహర్నిషలు కృషి చేస్తామని ఆయన తెలిపారు. శ్రీ సత్య సాయి, అనంతపురం జిల్లాలలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, అధిష్టానమేరా పార్టీకి విధేయులై ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గుంతకల్ టౌన్ ప్రెసిడెంట్ మహేష్, ఆలం నవాబ్, తాయిదాస్, నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు .

## క్షయ వ్యాధి గుర్తింపునకు ఇంటింటా సర్వే



కదిరి టౌన్, మేజర్ న్యూస్: మున్సిపాలిటీ లోని యుపి హెచ్ సి రాజీవ్ గాంధీ నగర్, న్యూ దళితవాడ , గాంధీ నగర్ క్రాస్ , అంగన్వాడి సెంటర్ ప్రాంతంలో సోమ వారం వైద్య ఆరోగ్య సిబ్బంది క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ఇంటింటా క్షయ వ్యాధి రోగులు గుర్తించుటకు సర్వే నిర్వహించారు. కేసులను గుర్తించ డానికి ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని, టీవీ లక్షణాల్లో అయినా రెండు వారాల నుంచి దగ్గు ఉండటం, సాయంత్రం పూట జ్వరం రావడం, తగ్గినప్పుడు గళ్ళలో రక్తం పడడం, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉన్నవారిని గల్ల పరీక్షకు పంపించడం జరిగిందన్నారు. అలాగే టీబీ వ్యాధి ఉన్న వారి ఇంటిలో వారందరికీ గళ్ళ పరీక్షలు చేసి వారికి టీబి రాకుండా ప్రివెంటివ్ మెడిసిన్ అందజేయడం జరుగుతుందని కూడా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, క్షయ నివారణ సిబ్బంది పాల్గొన్నారు.

## సామూహిక వైదిక అగ్ని హోత్రమునకు విరాళము



హిందూపురం మేజర్ న్యూస్: ఈ నెల 23 వ తేదీన హిందూపురం పట్టణంలోని దండు రోడ్డులో గల 27 అడుగుల ఏకశిలా ఆంజనేయ స్వామి ప్రాంగణము నందు జరుగు సామూహిక వైదిక అగ్నిహోత్రము నకు లేపాక్షి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కరణం రామానంద్ రూ.5116/ అన్న ప్రసాదముల కొరకై విరాళము గా హోమ నిర్వాహకులు దేవాంగం శంకరప్ప, యోగా శంకర్, రవి ప్రకాష్, బాలాజీ కుమార్ లకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మీరు చేస్తున్న సేవా కార్యక్రమం చాలా అభినందనీయం మని, నిరుపేదల పాలిట సేవా కార్యక్రమాలు వరంగా మారాయి అని రమానందన్ ను అభినందించారు.

## రైతుల వేరుశనగ పంటలు పరిశీలించిన ఏవో



నల్లమాడ, మేజర్ న్యూస్ : మండలం లో వేరుశనగ పంట లు సాగుచేసిన రైతుల పంట పొలాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి శంకర్ నాయక్ పరిశీలించారు. నల్లమాడ రైతు సేవ కేంద్రం పరిధిలోనే రైతు జక్రియ వేరుశనగ పంట పొలాన్ని పరిశీలించి వేరుశనగ పంటలకు వచ్చే తెగుళ్లు, వాటి నివారణ గురించి రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నే 30 రోజులు లోపు వేరుశనగ పంటకు తిక్కాకు, మచ్చ తెగుళ్లు వ్యాధి సోకుతుందని వీటి నివారణ కోసం 400 గ్రాములు మ్యాం కో జబ్ ను 200 లీటర్ల కలిపి పిచికారి చేయాలన్నారు. అదేవిధంగా వేరుశనగ పంటలో ఏవైనా తెగుళ్లు వచ్చినట్లయితే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సలహాలు సూచనలు మేరకు మందులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారితో పాటు ఎంపీఈవో రాధమ్మ, ఆర్బీకే సిబ్బంది భాస్కర్ నాయక్, అస్లాం భాష, రైతులు ఉన్నారు.

## ఎస్సీ కాలనీలో ఇంటి ముందర రోడ్డుపై మురుగునీరు



అగళి మేజర్ న్యూస్: మండల కేంద్రమైన అగళి ఎస్సీ కాలనీలో తరకారి రంగనాథ ఇంటి ముందర గల రోడ్డుపై మురుగు నీరు పారుతూ దుర్గంధం వెదజల్లుతుంది. ఎగువ ప్రాంతంలో కొత్తగా సీసీ రోడ్డును నిర్మించారు కానీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువ పెట్టకపోవడంతోనే మురుగు నీరంతా మా ఇంటి లోనికి వస్తున్నదని కాలనీవాసులు రంగనా తప్ప, పుట్ట నరసమ్మ, కరియప్ప, నాగరాజు తదితరులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మా ఇంటిలోకి నడుచుకుంటూ వెళ్లలేక పోతున్నామని రోడ్డుపై మురుగునీరు పార కుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందని,వెంటనే మరమ్మత్తు చేపట్టి సమస్యను పరిష్కరించాలని దళిత కాలనీవాసులు కోరుతున్నారు.

# వైఎస్ఆర్టీఏ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



**నంబులపూలకుంట, మేజర్ న్యూస్ :** మండల కేంద్రం లోని ఎంఆర్సీ కార్యాలయం వద్ద సోమవారం వై ఎస్ ఆర్ టీ ఏ క్యాలెండర్, డైరీలను ఎం ఈ ఓ లు గోపాల్ నాయక్, సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రప్రసాద్, గంగాధర్ రెడ్డి,శివయ్య, ఆంజనేయులు నాయక్ ల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం లో తమ సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఉపాధ్యాయులకు 30 శాతం ఐ ఆర్ ప్రకటిం చాలని, పెండింగ్ లో ఉన్న డి ఏ, సరెండర్ లీవులు, పీ ఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే బదిలీలలో ప్రాథమికోన్నత పాఠశాలలలో స్కూల్ అసిస్టెంట్ లను కొనసాగించాలని, ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు ఉండవలసిన విద్యార్థుల సంఖ్యను తగ్గించాలని, ప్రధానోపాధ్యాయులకు ఉన్న విధంగా 5సంవత్సరాల గరిష్ట పరిమితిని, ఉపాధ్యాయులకు వర్తింపచేయలని, గతం లో రేషనలైజేషన్ కు గురై, ప్రస్తుతం మరలా రేషనలైజేషన్ కు గురవుతున్న వారికి పాత స్కూల్ పాయింట్లు ఇవ్వాలని, 117 జీ ఓ రద్దు చేయడం ద్వారా పాఠశాలలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట రామిరెడ్డి, ఆనంద్ నాయక్, వేణుగోపాల్ రెడ్డి, కుంచపు శ్రీనివా సులు, శ్రీనివాసరెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

# మంత్రి సవితమ్మ గారూ.. సొంత శాఖను పట్టించుకోరా?

**- సొంత శాఖలో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు శూన్యమేనా? - హాస్టళ్లలో రుచి, శుచి లేకుండా నిర్వహణ**

**- జిల్లా అధికారిణి, హాస్టల్ వార్డెన్ల మధ్య కోల్డ్‌వార్ - కాసులిస్తే..ఒకే వార్డెన్‌కే మూడు హాస్టళ్లు అప్పగింత**

**శ్రీసత్యసాయి జిల్లా బ్యూరో, మేజర్‌న్యూస్ :** పచ్చ కామెర్ల వాడికి లోకమంతా ఎలా పచ్చగా కనిపిస్తుందన్న చందంగా... బీసీ సంక్షేమ శాఖ జిల్లాలో భ్రష్టు పడుతోందని..అయినా కూడా మంత్రి సవితమ్మ పట్టించుకోవడం లేదంటూ విమర్శలు, ఆరోపణలు వినపడతున్నాయి. మంత్రి సవితమ్మ తన శాఖను పూర్తి విస్మరించారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మంత్రి సవితమ్మ కు శ్రీ సత్యసాయి జిల్లా. జిల్లాలోని బీసీ వెల్ఫేర్, హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాల్సిన మంత్రి పట్టించుకోవడం లేదన్న వాదన బలం చేకూరుతుంది. జిల్లా అధికారిణి నుండి కింది స్థాయిలో ఉన్న హాస్టల్ వార్డెన్ వరకు పూర్తిగా అవినీతిలో కూరుపోయారనే ఆరోపణలు తీవ్ర స్థాయిలో విమర్శలున్నాయి. అయినా కూడా మంత్రి సవితమ్మకు ఇదంతా కనిపించలేదా? అన్న సందేహం ప్రజల్లో నెలకొంటోంది. జిల్లాలోని హాస్టళ్లు అధ్వానంగా తయారయ్యాయని, విద్యార్థులకు పౌష్టికాహారం దేవుడెరుగు నాణ్యమైన భోజనం కూడా వడ్డించలేదని విద్యార్థులు వాపోతున్నారు. మంత్రి సొంత జిల్లాలో బీసీ వెల్ఫేర్ డీడీ పర్యవేక్షణ లోపం, వార్డెన్ల అవినీతిలో కూరుకుపోవడంతో మంత్రి జిల్లాను వదిలి రాష్ట్ర వ్యాప్త పర్యటనలు, విజయవాడలో ఉండడం.. ఆపై మంత్రి పట్టించుకోలేదు. రోజు రోజుకు అవినీతిలో కూరుకుపోతున్న అధికారులపై మంత్రి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో మంత్రి



అభాసుపాలు కావడం తథ్యమని పలువురు పేర్కొంటున్న విధానం కొనసాగుతోంది.

**జిల్లా సంక్షేమ శాఖ డీడీపై ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు**

బీసీ వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ డీడీ అవినీతి, అక్రమాలపై పాల్పడుతున్నారని ఇటీవల విద్యార్థి సంఘాల నాయకులు విజయవాడలోని బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. జిల్లాలోని బీసీ హాస్టళ్ల వార్డెన్లను బెదిరించి, వారి వద్ద పెద్ద మొత్తంలో వసూలు చేసినట్లు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగానే కదిరి, మడకశిర, ధర్మవరం, హిందూపురం డివిజన్‌లలోని పలు వార్డెన్లకు మెమోలు జారీ చేసి వారి వద్ద నుండి భారీగా వసూలు చేశారని జిల్లా అధికారిణిపై ఆరోపణలను వార్డెన్లే వ్యక్తం పరుస్తున్నారు. అంతే కాకుండా జిల్లా అధికారిణి తన సామాజిక వర్గానికి చెందిన వారిని ప్రోత్సహిస్తున్నారని, మిగిలిన తొక్కి పెడుతోందని పలువురు హాస్టల్ వార్డెన్ల పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లా అధికారిణి, హాస్టళ్ల వార్డెన్ల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది.

**కాసులిస్తే.. ఒకే వార్డెన్‌కే రెండు, మూడు హాస్టళ్ల ఇన్‌చార్జ్ బాధ్యతలు**

జిల్లాలోని చాలా హాస్టళ్లకు వార్డెన్లకు లేకపోవడంతో జిల్లా అధికారిణికి కాసుల పంటగా మారింది. తనకు అనుకూలమైన వార్డెన్ల వద్ద పెద్దమొత్తం ముడుపులు తీసుకొని రెండు, మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతలు అప్పగిస్తున్నారని వార్డెన్ల వాపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన వార్డెన్లకు మళ్లీ మెమోలు ఇవ్వడంతో పాటు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇదే కోవలోనే కదిరి డివిజన్‌లోని ఓ హాస్టల్ వార్డెన్‌కు రెండుహాస్టళ్లకు ఇన్‌చార్జ్‌గా నియమించి, ఆపై తొలగించి, మరొకరికి ఇన్‌చార్జ్‌లు నియమించారని కదిరి డివిజన్‌లోని పలువురు వార్డెన్ల పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా మంత్రి పట్టించుకోకపోవడమే ఇందుకు నిదర్శనమని వార్డెన్లు వాదనగా ఉంది. ఏదీ ఏమైనా జిల్లాలోని బీసీహాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడం, జిల్లా స్థాయి అధికారి నుండి హాస్టల్ వార్డెన్ వరకు అవినీతి, అక్రమాలు పాల్పడే వారిపై చర్యలు తీసుకొని, అవినీతి ఆస్కారం లేకుండా ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత మంత్రిపై ఉంది.


జనం కోసమే సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన
వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళలా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం.

ఉమ్మడి అనంతపురం జిల్లాల
బ్యూరో అండ్ బ్రాంచ్ మేనేజర్
ఎన్. లక్ష్మీనారాయణ
ఫోన్ నెంబర్ : 63011 07116


## అయోధ్య, కుంభమేళాకు బయలుదేరిన మాజీ ఎమ్మెల్సీ..

మడకశిర మేజర్ న్యూస్:అయోధ్య రామ మందిరం , కుంభమేళాకు మడకశిర నుండి బయలుదేరి వెళ్లి లక్నో చేరుకున్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి..ఆయనతో పాటు మడకశిర నియోజకవర్గానికి సంబంధించిన మరి కొంతమంది భక్తాదులు కలిసి అయోధ్య , కుంభమేళాకు తరలి వెళ్లారు.





## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 80 అర్జీలు

**- ఎస్పీ పి.జగదీష్**

**అనంతపురం బ్యూరో మేజర్ న్యూస్** : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు వచ్చిన పిటీషనర్లతో మర్యాదగా వ్యవహరించి చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో " ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" ( పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రస్సల్ సిస్టం ) కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ జిల్లా నలమూలల నుండీ విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు . ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి, మహిళా డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించడం అభినందనీయం..

**- ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ**

**- క్రీడాకారులకు జూడో డ్రస్సులు, జూడో మ్యాట్స్ అందిస్తాం**

**- క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ రవి నాయుడు**

**రామగిరి మేజర్ న్యూస్:** గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించడం అభినందనీయమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ పేర్కొన్నారు. మండలంలోని నసనకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి జూడో పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ రవినాయుడు , రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునితమ్మ క్రీడాకారులను అభినందిం చారు. గత 4సంవత్సరాలుగా నసనకోట ఉన్నత పాఠశాల విద్యార్తులు 15 మంది జాతీయ స్థాయి జూడో పోటీలలో పాల్గొన్ననారు.ఆ క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసపత్రాలు బహుక రించించారు. ఎస్‌జిఎఫ్ అండర్ -14 జాతీయస్థాయి జూడో పోటీలలో కాంస్య పథకం సాధించిన జయసింహాను అభినందించారు. క్రీడాకురులకు జూడో డ్రెస్సులు, జూడో మాట్స్ అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే క్రీడాకారులకు అవసరమైన క్రీడాపరికరాలు, క్రీడామై దానం సమాకురుస్తామని శాప్ చైర్మన్, ఎమ్మెల్యే సునీతమ్మ హామీ ఇచ్చారని పాఠశాల పీడీ చామంతి తెలియచేసారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## శివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించండి

**- ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమా నందన్‌ను అభినందించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ**

లేపాక్షి ,మేజర్ న్యూస్: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి ఆలయం శివరాత్రి మహా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని, వేలాదిగా తరలి వచ్చి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి మహా శివరాత్రి ఘనంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆలయ కమిటీ చైర్మన్ కరణం రామానందం కు సూచించారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నందమూరి బాలకృష్ణ ను మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన ఘనంగా సన్మానించి దేవాలయ అభివృద్ధిపై చర్చించారు. ఆలయ అభివృద్ధి పనులపై ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి పలు అభివృద్ధి పనులు తీసుకెళ్లినట్టు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం దేవాలయం పై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని కార్యక్రమాలలో చురుగ్గా పని చేస్తున్న చైర్మన్ అభినందించారు. అనంతరం శివరాత్రి కి జరిగే ఉత్సవాలలో పాల్గొనాలని ఎమ్మెల్యేను చైర్మన్ ఆహ్వానించారు. దీనిపై స్పందించిన ఆయన ఉత్సవాల నిర్వహణ లో కూడా నా వంతు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు.




## ప్రజా ఫిర్యాదులపై సత్వరమే విచారణ జరిపి న్యాయం చేయండి : ఎస్పీ

పుట్టపర్తి క్రైమ్, మేజర్ న్యూస్ : ఫిర్యాదులను సత్వరమే విచారించి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వి.రత్న పోలీస్ అధికారులకు ఆదేశించారు. శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ వి రత్న ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 60 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



# అపహుడా నిబంధనలకు తూట్లు..





**-చోద్యం చూస్తున్న అధికారులు**

**గోరంట్ల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలో ఇప్పటికే విరివిగా ఎక్కడపడితే అక్కడ అక్రమ లే అవుట్లు వేస్తున్న అక్రమ లే అవుట్లను అరికట్టవలసిన అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెళ్ళివేత్తుతున్నాయి. మండలానికి నాలువైపులా జాతీయ రహదారుల నిర్మాణం వేగవంతంగా జరుగుతుండటంతో అక్రమ లెఅవుట్ల వేయడం పుంజుకుంది. 44వ నెంబర్ నాలుగు వరుసల జాతీయ రహదారి, మరో రెండు 7162, 342 నెంబర్ లు గల నాలుగు వరుసల మూడు జాతీయ రహదారులు, ఆరు వరుసల ఒక గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారుల పనులు శరవేగంగా జరుగుతున్న కారణంగా మండల వ్యాప్తంగా ఎక్కడ పడితే అక్కడ, రోజు రోజుకు పూట పూటకు అక్రమ లేఅవుట్ వెలుస్తున్నాయి. ఇవన్నీ అరికట్టవలసిన నిత్యము చూస్తున్న తమ పని కానట్టుగా వ్యవహారిస్తున్నారు సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్న తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. లే అవుట్లకు ఏర్పాటు అవసరం ఇయినా పంచాయతీ అనుమతులు కానీ లేఅవుట్లకు పాటించాల్సిన ఏ ఇతర అనుమతులు, నిబంధనలు పాటించకుండా.. రాత్రికి రాత్రే అక్రమ లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. నిబంధనలు ప్రకారం ప్రాథమికంగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకోవదానికి రివెన్యూ అధికారులకు ప్రభుత్వానికి చలానారూపంలో రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకుంటే అధికారులు ఆ భూమిని పరిశీలించి వ్యవసాయేతర(ల్యాండ్ కన్వర్షన్) భూమిగా మార్చుకై ఆర్డీఒకు సిఫారసు చేస్తారు. అనంతరం ఆర్డీఒ దీన్ని పరిశీలించి వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు. తదుపరి సంబంధిత పంచాయితీ కార్యాలయంలో లే అవుట్ ఏర్పారుకు ధరహస్తూ చేసుకోవాలి.వ్యవసాయ భూములు కొనుగోలుకు అడ్వాన్సులు ఇచ్చిన వెంటనే ఆ మరుసటి రోజే భూమి చదును చేసేయడం, కంకర(డస్ట్ పొడితో పాట్లను మార్క్ చేయడం, హదులకు రాళ్ల పాతితే అంతే ఇక.. లేఅవుట్లు సిద్ధమైనట్లే. కొందరైతే ఇంకాస్తా.. ముందుకు వెళ్లి అదే దన్ను పలుచుగా వేసి లేఅవుట్లలో దారులుగా చూపడం, ఇదీ ఇక్కడ జరుగుతున్న తంతు. ఇంత కళ్ల ముందరే జరుగుతున్నా, అధికారులు ఇవన్నీ తమకు సంబంధం లేదు, ఇవన్నీ తమకు కనబడవు అన్న రీతిలో వ్యవహరించడంపై తీవ్రమైన ఆరోపణలు వినబడుతున్నాయి. ఇక చిన్న చితకా సమస్యలు ఎదురైతే లేఅవుట్ యజమానులు స్థానిక నాయకులను సంప్రదించి ప్రసన్నం చేసుకోవడం, అనంతరం అమ్మకాలు జరుపుతూనే ఉన్నారు. మండలంలోని 44వ నెంబర్ జాతీయ రహదారి పాలసముద్రం ప్రాంతం, గోరంట్ల నుంచి హిందూపురం వెళ్లే రహదారి, గోరంట్ల నుంచి బెంగళూరు వైపు గోరంట్ల నుంచి పుట్టపర్తి వైపు గోరంట్ల నుంచి కదిరి వైపు రోజుకొక కొత్త లేఆవుట్లు పై చెప్పిన రీతిలో దర్శనమిస్తూనే ఉన్నాయి. కొంతమంది కలుసుకొని గోరంట్ల పుట్టపర్తి 342 నెంబర్ నాలుగు వరసల జాతీయ రహదారిలో పట్టణానికి సమీపంలో ఇటీవల ఏకంగా రెండు లేఅవుట్లు దర్జాగా వేశారు. ఈ మూడు లేఅవుట్లు కనీసం ల్యాండ్ కన్వర్షన్ సైతం చేయకపోవడం విశేషం. దీనిపై అనేక ఫిర్యాదు వచ్చాయి. ఇదిలా ఉండగా.. ఈ లేఆవుట్లపై ఇఒఆర్డి శివన్నను విచారించగా దీనిపై నోటీసులు సిద్ధం చేశామని వెల్లడించారు. లే అవుట్ యజమానులకు నోటీసులు ఇచ్చిన అనంతరం లేఆవుట్లలో పాతిన రాళ్లను తొలగించి భూమిని చదును చేస్తామని స్పష్టం చేశారు.

## బదిలీపై వెళ్లిన బీసీ
## గురుకుల సెక్రటరీ కృష్ణ మోహన్‌కు సత్కారం





**రామగిరి మేజర్ న్యూస్:** బీసీ వెనుకబడిన తరగతుల రాష్ట్ర సెక్రెటరీ కృష్ణమోహన్ ఇటీవల స్కూల్ ఎడ్యుకేషన్ కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా బీసీ గురుకులాల గెస్ట్ టీచర్స్ అసోసియేషన్ విజయవాడలో మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి శ్రీయుత శ్రీ ఆకేపాటి.కృష్ణమోహన్ ను రాష్ట్ర అతిథి ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు తెనాలి బాబురావు మరియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రవిచంద్ర యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పపుచం శాలువాలతో సత్కరించారు. సత్యసాయి జిల్లా గెస్ట్ టీచర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవిచంద్ర యాదవ్ మాట్లాడుతూ బీసీ గురుకులాల్లో గెస్ట్ టీచర్స్ అసోసియేషన్ శ్రేయాభివృద్ధికి ఎంతో కృషి చేసిన మంచి మనసున్న వ్యక్తి కృష్ణమోహన్ అని ఈ సందర్భంగా ఆయనకు మాకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వారు తెలిపారు. నూతన సెక్రటరీగా బాధ్యతలు తీసుకున్న మాధవి లత కు కూడా స్వాగతం పలుకుతూ పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు వివిధ జిల్లాల నుండి దాస్,మురళి మోహన్ రెడ్డి, తోటకూరి ప్రసాద్, శ్యామ్,సహదేవ్,నాగరాజు నాయక్,రవికుమార్,రామారావు, దేవదాసు,శాంతిరాణి,విజయ ,లక్ష్మి మరియు తది తరులు అందరూ కలిసి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం శాలువాతో సత్కరించారు

## సన్ రైజర్స్ పాఠశాలలో
## ఘనంగా శ్రీ పంచమి వేడుకలు

**-చదువుల తల్లి సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు**
**-చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం,తహసిల్దార్ షర్మిల, ఎంఈఓ మల్లారెడ్డి**




**బెలుగుప్ప, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన బెలుగుప్పలోని సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం చదువుల తల్లి సరస్వతి దేవి పుట్టిన నక్షత్రం శ్రీ పంచమి ( వసంత పంచమి) వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మారెన్న ఆధ్వర్యంలో శ్రీ పంచమిని పురస్కరించుకొని చదువుల తల్లి సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల తహసిల్దార్ షర్మిల, ఎంఈఓ- 1 మల్లారెడ్డి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విశ్రాంతి ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మారెన్న ముఖ్య అతిథులు తహసిల్దార్ షర్మిల, ఎంఈఓ- 1 మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పండితులు మంత్రోచ్ఛారణల మధ్య భక్తిశ్రద్ధలతో చదువుల తల్లి సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ పంచమి, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాస కార్యక్రమానికి విచ్చేసిన చిన్నారులకు పాఠశాల యాజమాన్యం ఉచితంగా పలకలను పూజా సామాగ్రిని అందించి చిన్నారుల చేత పూజలు చేయించారు. అనంతరం చిన్నారులకు తహసిల్దార్ షర్మిల, ఎంఈఓ మల్లారెడ్డి, కరస్పాండెంట్ మారెన్నలు అక్షరాభ్యాసం చేయించారు. ప్రతి సంవత్సరం శ్రీ పంచమిని పురస్కరించుకొని చదువుల తల్లి సరస్వతీ దేవి కి ప్రత్యేక పూజలు నిర్వహించే సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం నిర్వహించడం అభినందనీయమని తహసిల్దార్ షర్మిల, ఎంఈఓ మల్లారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ షర్మిల, ఎంఈఓ-1 మల్లారెడ్డి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు, పాఠశాల కరస్పాండెంట్ మారెన్న, డైరెక్టర్లు నాగభూషణం, తిప్పేస్వామి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫీజు పోరు ర్యాలీ జయప్రదం చేయండి

**అనంతపురం జిల్లా కేంద్రంగా**
**జరిగే ఫీజు పోరు ర్యాలీకి పెద్ద ఎత్తున తరలిరండి**
**సంయుక్తంగా పిలుపునిచ్చిన శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, శాసనమండలి సభ్యులు వై శివరామిరెడ్డి, యువనేత వై భీమిరెడ్డి**



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.3900 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తరపున యువజన శ్రామిక రైతు పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి రేపు అనగా బుధవారం ఉదయం 10గంటలకు పెద్ద ఎత్తున ర్యాలీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు, ర్యాలీ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా స్థానిక పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలిరావాలని శాసనమండలి సభ్యులు వై శివరామిరెడ్డి, యువ నేత వై భీమిరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు పోరు ర్యాలీ జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం నుంచి ప్రారంభమై సప్తగిరి సర్కిల్, సూర్యా నగర్ మీదుగా కలెక్టరేట్ కార్యాలయం చేరుకొని అక్కడ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు. ఫీజు పోరు ర్యాలీ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## 'ఫీజు పోరు'కు తరలి రండి..యంపిపి

**-విద్యార్థి సంఘాలు, స్వచ్ఛందంగా విద్యార్థులు,**
**తల్లిదండ్రులు, మండల ప్రజలు తరలిరావాలని పిలుపు**



**కూడేరు, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురవుతున్న విద్యార్థులకు అండగా ఉండేందుకు ఈ నెల 5న (బుధవారం) వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టనున్న 'ఫీజు పోరు'కు తరలి రావాలి అని కూడేరు యంపిపి నారాయణ రెడ్డి మండల వైయస్సార్సీపి కార్యకర్తలు, సర్పంచులు ఎంపీటీసీలకు సోమవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రూ.3,900కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. సప్తగిరి సర్కిల్, సూర్య నగర్ మీదుగా కలెక్టరేట్ వరకు చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందివ్వనున్నట్లు తెలిపారు. కొన్ని చోట్ల ఫీజుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలోనే విద్యార్థులకు అండగా వైయస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో 'ఫీజు పోరు' నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. సమావేశంలో వైసీపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి, బీసీ సెల్ దేవేంద్ర, వడ్డే గంగాధర్, తోపుదుర్తి రామాంజినేయులు, సర్పంచ్ రంగారెడ్డి ఎస్సీ సెల్ కరట్లపల్లి అక్కులప్ప, ఎస్టీ సెల్ శంకర్ నాయక్, మాజీ కన్వీనర్ కురుబ రామచంద్ర, వైస్ ఎంపీపీ దేవా సుబ్బమ్మ, ఎంపీటీసీ రమేష్, శంకరయ్య, ఈశ్వరయ్య, ఎడమల తదితరులు పాల్గొన్నారు.



## తప్పెట్లతో హైదరాబాద్‌కు తరలివెళ్దాం

### – ఎస్సీ వర్గీకరణ నినాదాన్ని దద్దరిల్లిద్దాం

అనంతపురం రూరల్ మేజర్ న్యూస్ : పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాదులో నిర్వహించనున్న " లక్షల డప్పులు – వేల గొంతులు" కార్యక్రమానికి మాదిగలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బీసీఆర్ దాస్ పిలుపునిచ్చారు. సోమవారం అనంతపురం రూరల్ మండలంలో సోమలదొడ్డి, కురుగుంట గ్రామాలలో మాదిగలకు తప్పెట్లు పంపిణీ చేసి చలో హైదరాబాద్ కు తరలి రావాలని కోరారు. రూరల్ మండల వ్యాప్తంగా 165 డప్పులతో రెండు ఐచర్లు, రెండు తుఫాన్లు వాహనాలతో మాదిగలు తరలి వెళ్తామని తెలిపారు.

## ప్రజ్ఞా వికాస్ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి

### – పోస్టర్ల విడుదలలో సీఐ జయానాయక్



రాయదుర్గం, మేజర్ న్యూస్: పరీక్షల భయాన్ని పోగొట్టడం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 9 న నిర్వహించే ప్రజ్ఞా వికాస్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ సీఐ జయానాయక్ పదవ తరగతి విద్యార్థులకు పిలుపు నిచ్చారు. అందుకు సంబంధించిన పోస్టర్లను ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ మాట్లాడుతూ ప్రముఖ విద్యావేత్త , ప్రస్తుత ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో ప్రజ్ఞా వికాస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి సిలబస్ ఆధారితంగానే ప్రశ్నాపత్రం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు మీ పాఠశాల వివరాలతో 6302317927, 8522898620, 6300323431 నెంబర్ల ను సంప్రదించాలని కోరారు.

## హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలని నేడు మహాధర్నా

### – ముఖ్యఅతిథిగా హాజరుకానున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురము రూరల్ మేజర్ న్యూస్: హంద్రీ నీవా లైనింగ్ పనులు ఆపి ఆయకట్టుకు నీరు అందించాలనే ఫిబ్రవరి 4వ తేదీన హంద్రీ నీవా కార్యాలయం వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజగదీష్, ఇతర వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, జలసాధన సమితి నాయకులతో పెద్దఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి సి. జాఫర్ తెలిపారు.. సోమవారం సిపిఐ పార్టీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ... రాయలసీమ జిల్లాకు వరప్రసాది హంద్రీనీవా పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. వర్షాభావం వల్ల ఇక్కడి రైతులు వేరే ప్రాంతాలకు వలస పోతున్నారని, వలసల అడ్డుకట్టకు సాగునీరు సమృద్ధిగా ఇవ్వాలన్నారు. ప్రస్తుతం 30 లక్షల మందికి తాగునీరు ఇవ్వడానికి, మూడు లక్షల 45 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే పథకం నత్తనడక నడుస్తోంది అన్నారు. కాలువ వెడల్పు చేయకుండా పదివేల క్యూసెక్కుల నీరు ఏ విధంగా అందిస్తారని ప్రశ్నించారు. మల్యాల నుంచి 12 పంప్ సెట్లకు కాను6 పంప్ సెట్లు పనిచేస్తోందన్నారు. వెంటనే లైనింగ్ పనులు ఆపి ఆయకట్టు ద్వారా క్షణమే పిల్ల కాలవలు తవ్వి నీరందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హంద్రీనీవా కార్యాలయం వద్ద చేపడుతున్న ధర్నాలో సిపిఐ , వామపక్ష నాయకులు, కాంగ్రెస్, జలసాధన సమితి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి. నారాయణస్వామి, సి. మల్లికార్జున,, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీతో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్

అగళి మేజర్ న్యూస్: మండల కేంద్రమైన అగళి బోయ కులానికి చెందిన బలే హళ్లి నాగరాజు భార్య నాగవేణి( 37) కొద్ది రోజుల నుంచి బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతుండేది. వైద్యం కోసం ఎక్కడికి వెళ్లినా లక్షల్లో ఖర్చు అవుతుందని చెప్పడంతో నిరుపేద అయిన భర్త నాగరాజు తల్లడిల్లి పోయాడు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు వినాయక హాస్పిటల్ కి వెళ్లి డాక్టర్ను సంప్రదించగా అక్కడి వైద్యులు పరీక్షలు చేసి బ్రెయిన్ ట్యూమర్ కు ఆపరేషన్ చేయాలని రూ 6లక్షలు అడ్వాన్స్ గా చెల్లించాలని తెలిపారు.డబ్బులు లేకపోవడంతో ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ పేద కుటుంబాన్ని ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ ఆదుకుంది.ఆ పథకంలో ఆమెకు ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్నాడు. ఇప్పుడు ఆరోగ్యంగా ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యి ఇంటికి తిరిగి వచ్చింది. ఆమెకు ఆపరేషన్ చేసిన బెంగళూరు రామయ్య హాస్పిటల్ కు చెందిన వైద్యాధికారి గిరిధర్ సుమారు రూ.8:30 లక్షల రూపాయలు ఖర్చు అయ్యే ఆపరేషన్ ను ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేసి భార్య నాగవేణి ప్రాణాలను కాపాడినట్లు భర్త నాగరాజు తెలిపాడు. మేము వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండే వారమని, నా భార్య బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి వల్ల పనికి కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. మాకు కార్తీక్ కీర్తన ఇద్దరూ పిల్లలు. దీంతో కుటుంబ పోషణ కూడా భారంగా మారింది. నా భార్య ఇద్దరు పిల్లలు పలు ఇబ్బందులు పడ్డారు. అప్పులు పుట్టలేదు.



ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేని సమయంలో ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం నాకు ఎంతో ఉపయోగపడింది. నా భార్య నాగ వే ణి తలలో మెదడు కణి తి ఆపరేషన్ ను ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్నాను. డాక్టరు నా భార్యకు పునర్జన్మని ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ ఎమ్మెస్ రాజుకు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామికి, అగళి మండలం జెడ్పిటిసి ఉమేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ నేను నా భార్య జీవితాంతం వీరికి రుణపడి ఉంటామని భార్యాభర్తలు నాగరాజు నాగవేణి లు తెలిపారు.

# 4న అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం

### – డాక్టర్. జి. విష్ణు ప్రియాంక, కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్, కిమ్స్ సవీర, అనంతపురం



**అనంతపురం బ్యూరో మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహిస్తారు. క్యాన్సర్ చికిత్సలో వ్యాధిని ముందుగా గుర్తించడం, తగిన సమయంలో చికిత్స తీసుకోవడం మరియు మానసిక ప్రేరణ అనేది చాలా అవసరం.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 10 లక్షల మందికి పైగా క్యాన్సర్‌తో మరణిస్తున్నారు. అంతే కాకుండా, మరణాల జాబితాలో క్యాన్సర్ రెండవ ప్రధాన కారణం. వర్ధమాన దేశాలు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న దేశాల్లో పది మరణాల్లో ఏడు మరణాలు క్యాన్సర్ కారణంగా సంభవిస్తుండడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా ఈ మరణాలలో 40 శాతానికి పైగా జీవనశైలి మార్పులు, రెగ్యులర్ చెకప్‌లు మరియు ముందస్తుగా గుర్తించడం మరియు చికిత్స చేయడం ద్వారా నివారించవచ్చు.శరీరంలో ఏదైనా అవయవానికి క్యాన్సర్ సోకితే తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవు. వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి దీని నిర్ధరణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయి. కొన్ని రకాల క్యాన్సర్లనూ ఒకే విధమైన పరీక్షతో తెలుసుకోవడం సాధ్యం కాదు. క్యాన్సర్ అంటువ్యాధికాదు. అలాగే వంశపారంపర్యంగా వచ్చే అవకాశం కూడా తక్కువే. అయితే, రొమ్ము, థైరాయిడ్, పెద్దపేగు, పాంక్రియాస్ క్యాన్సర్లు జన్యుపరంగా సంక్రమిస్తాయి. కుటుంబంలో ఎవరికైనా ఈ క్యాన్సర్లు వస్తే వచ్చే ప్రమాదం ఉంది. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించకపోతే ఇతర భాగాలకూ వ్యాపించి, చికిత్సకు సైతం ఏమాత్రం తగ్గుముఖం పట్టవు. కాబట్టి దీనిపై అవగాహనతో ఎదుర్కొవాలి.

**పిల్లలకి వారి హద్దులు గురించి ఇలా చెప్పండి**

క్యాన్సర్‌కు కారణాల్లో ఆధునిక జీవన శైలి ప్రధానమైంది. మద్యం, పొగతాగడం, ఆహారపదార్థాల్లో రంగులు వినియోగం, రసాయనాలు వాడటం, హార్మోన్లు అధికంగా వాడటం, అధిక బరువు, కాలుష్యం, క్రిమిసంహారకాలు, చికిత్సలో భాగంగా లేదా ప్రమాదవశాత్తు రేడియేషన్‌కు గురికావడం, తరచూ వేధించే ఇన్ఫెక్షన్లు.. ఇవన్నీ క్యాన్సర్‌కు కారకాలు. కొన్ని రకాల కేన్సర్లను రాకుండా వ్యాక్సిన్ వేసుకోవచ్చు. వాటిలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు ప్రధాన కారణం హెచ్‌పీవీ వైరస్. కాబట్టి దీనికి వ్యాక్సిన్ వేసుకుని నివారించవచ్చు. 9 ఏళ్లు పైబడిన బాలికల నుంచి 40 ఏళ్ల మహిళల వరకు ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. అలాగే అండాశయం, గొంతు క్యాన్సర్ రాకుండా కూడా ఇది అడ్డుకుంటుంది. క్యాన్సర్ కణం ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం, దానికి ఇతర అవయవాలకు విస్తరించే గుణం ఉందా అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. సర్జరీ, మందులు, థెరపీలు కూడా దీనిపైనే ఆధారపడి ఉంటాయి. క్యాన్సర్‌ను జయించడం, త్వరగా గుర్తించడంతో పాటు ఆ కణితులు పరిమాణం, దశ, గ్రేడింగ్ కూడా చాలా ముఖ్యం. కాన్సర్‌కు వయసుతో సంబంధం లేదు. అన్ని వయసుల వారూ దీని బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. కానీ చిన్నపిల్లల్లో వచ్చే క్యాన్సర్లను చాలా వరకు పూర్తిగా నయం చేయగలిగినవే. అయితే, వయస్సు పెరిగేకొద్ది క్యాన్సర్స్ వచ్చే ముప్పు ఎక్కువ. ఈ సమయంలో వచ్చే క్యాన్సర్ల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అందుకే క్యాన్సర్ చికిత్సను కూడా వయస్సును బట్టి నిర్ధరిస్తారు. క్యాన్సర్ కణాలను నిర్వీర్యం చేయడానికి కీమోథెరఫీ, రేడియోథెరఫీలతో పాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చేసే కీహోల్ సర్జరీలు కూడా నేడు అందుబాటులో ఉన్నాయి. సర్జరీ తర్వాత రేడియో, కీమో, హార్మోన్ థెరఫీ లాంటివి చేసినా, లేక థెరఫీల తర్వాత సర్జరీ చేసినా చికిత్స అంతటితో అయిపోయిందని భావించరాదు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్ కణం శరీరంలో ఎక్కడుందనే విషయం తెలుసుకోవడం కష్టం. ఏ అవయవానికి సోకిందనే అనుమానం ఉంటే దానికి సంబంధించిన పరీక్షలు వేర్వేరుగా ఉంటాయి. వీటిలో బయాప్సీ, యఫ్‌యన్‌ఏ టెస్ట్, బ్లడ్ మార్కర్స్, ఎక్స్–రే, సీటీ స్కాన్, యంఆర్ఐ, పీఈటీ స్కాన్ వంటివి అవసరాన్ని బట్టి చేస్తారు. అయితే సర్వైకల్ క్యాన్సర్‌ను పాప్‌స్మియర్ ద్వారా ముందుగా గుర్తించవచ్చు.

## స్మశాన వాటికలను కబ్జాల నుండి రక్షించండి

### – సిపిఐ డిమాండ్

చిలమత్తూరు, మేజర్ న్యూస్ : మండల కేంద్రంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్ రెడ్డి ఆధ్వర్యంలో స్మశాన వాటిక లను కబ్జాల నుండి రక్షించాలని డిప్యూటీ తహసిల్దార్ జగన్నాథకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా భూముల ధరలకు రెక్కల రావడంతో ఇష్టారాజ్యముగా పలువురు స్మశాన వాటిక లను సైతం ఇష్టారాజ్యముగా కబ్జా చేసేసారని, మరికొన్నిచోట్ల చేసేస్తున్నారని, ఈ విషయంపై వెంటనే రెవిన్యూ అధికారులు స్పందించి ప్రతి గ్రామానికి సంబంధించిన స్మశాన వాటికలలో ముళ్ళ పొదలను తొలగించి సర్వేలు చేయించి హద్దులు నిర్ణయించాలని,



అదేవిధంగా స్మశాన వాటికలోకి వెళ్లడానికి రహదారులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహప్ప, నాగిరెడ్డి బాలచంద్ర, రామంజి, గంగాధరప్ప, పురుషోత్తం తదితరులు సిపిఐ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మా ఇంటికి దారి చూపండి సార్...

## – కలెక్టర్‌కు ఓ పేద కుటుంబం విన్నపం



పుట్టపర్తి మేజర్ న్యూస్: మండల కేంద్రమైన చెన్నై కొత్తపల్లిలోని బస్టాండ్ వెనుక భాగంలో 272 సర్వే నెంబలో పంచాయతీ స్థలం లో గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న మా ఇంటికి దారి చూపాలని బోయ ఆదిలక్ష్మి మహిళ జిల్లా కలెక్టర్ కు విన్నవించుకుంది. శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ ను బోయ ఆదిలక్ష్మి కలిసి తమ బాధను తెలియజేశారు. మా ఇంటి పక్కన నిర్మిస్తున్న ఓ భవంతి యజమాని నిర్వాకం వల్ల మా ఇంటికి వెళ్లే దారిలో మరుగుదొడ్ల నిర్మాణం, సంపు కట్టడం కోసం పెద్ద గుంత తీశారని తద్వారా దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షాకాలంలో మా చుట్టుపక్కల మొత్తం వర్షపు నీరు చేరుతాయని, మా వీధికి వెళ్లే దారిలో అక్రమ నిర్మాణాలు చేయకుండా ఆపాలని కోరుతూ న్యాయం చేయాలని కలెక్టర్ కు విన్నవించుకున్నారు.

# మద్యం అమ్మకాలను నియంత్రించాలని వినూత్న నిరసన




అనంతపురం రూరల్ మేజర్ న్యూస్: జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాలలో జనావాసాలు, రద్దీ ప్రాంతాలలో వైన్ షాపుల్లో అక్రమ మద్యం అమ్మకాలను, బెల్ట్ షాపులను నియంత్రించాలని సోమవారం అనంతపురం కలెక్టరేట్ వద్ద ఏపీ మహిళా సమైక్య ఆధ్వర్యంలో మహిళలు మద్యం సీసాలతో వినూత్న నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళా సమైక్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతి ప్రసాద్ ,పద్మావతి మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాలలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా మద్యం షాపులను పెట్టి గుడి ,బడికి ,బస్టాండ్, రైల్వే స్టేషన్, జనావాసాలు, దగ్గరలో మద్యం షాపులు విచ్చలవిడిగా వైన్ షాపులకు అనుమతులు ఇస్ మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారని, దీనివల్ల మహిళలకు, యువతులకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విచ్చలవిడి మద్యం అమ్మకాలను పై ప్రభుత్వ అధికారుల చూసి చూడనట్లు వ్యవహరించడంబి సరైంది కాదన్నారు. మద్యం అమ్మకాలను నియంత్రించకపోతే మహిళలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య నాయకులు సారంబి, పి ఆదేమ్మ, సరోజమ్మ ,లక్ష్మీదేవి, ఓబులమ్మ ,జె ఆదమ్మ ,అక్కమ్మ ,వన్నూరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# 19వ డివిజన్లో అభివృద్ధి జరగలేదనేది అవాస్తవం

## – నగర మేయర్ వసీం



అనంతపురం బ్యూరో మేజర్ న్యూస్ : నగరంలోని 19వ డివిజన్ లో అభివృద్ధి జరగలేదనేది అవాస్తవమని వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని అనంతపురం నగర మేయర్ మొహమ్మద్ వసీం సలీం పేర్కొన్నారు. కార్పొరేటర్ బాల ఆంజనేయులు పార్టీ మారడం అతని వ్యక్తిగతమని గత నాలుగు నెలలుగా పార్టీ మారే ప్రయత్నాలలో ఉన్నారని తెలిపారు. అతని డివిజన్ పరిధిలో అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడడం సరైనది కాదన్నారు. అభివృద్ధి జరిగిందో లేదో బాలాంజనేయులు ని అడిగితే చెబుతారన్నారు. ఐదేళ్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో నాలుగు కోట్ల అభివృద్ధి పనులు ఆ డివిజన్ పరిధిలో జరిగాయని తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి 1100 కోట్లతో అభివృద్ధి పనులను చేసి చూపించాం. అర్బన్ నియోజకవర్గానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ఆనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి దక్కుతుంది. అనంతపురం అర్బన్ పరిధిలో నగరపాలక సంస్థ కు వచ్చే పన్నుల ఆదాయంతో అభివృద్ధి పనులను చేసుకుంటూ పోవడం ఆనవాయితీగా ఉంటుంది. వీటిని కాదని అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఒక్క రూపాయి నిధులు తీసుకొచ్చారా అని ఎమ్మెల్యేను సూటిగా ప్రశ్నించారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి ప్రత్యేకంగా ఎమ్మెల్యే ఫండ్స్, స్పెషల్ ఫండ్స్ ద్వారా అభివృద్ధి పనులు చేశారా అని సూటిగా ప్రశ్నించారు. నగరపాలక సంస్థ ద్వారా జరిగే పనులను తాము చేస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అనంతపురం అర్బన్ నియోజకవర్గం వర్గానికి ఒక్క రూపాయి నిధులైన తీసుకువచ్చారా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా మల్లె మీద నరసింహులు, శ్రీనివాసులు, అనిల్ కుమార్ రెడ్డి , కమల్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులపై విచారణ జరిపించాలి

## – కలెక్టరేట్‌లో విహెచ్‌పియస్ ఆధ్వర్యంలో వికలాంగుల ధర్నా



**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్:** వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టుల్లో అక్రమాలపై విచారణ జరిపించాలని విహెచ్పిఎస్ ఆధ్వర్యంలో వికలాంగులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న, ఎం ఎస్ పి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కెబి మధు మాట్లాడుతూ అనంతపురం జిల్లా కూడేరు మండలం కరుట్లపల్లి గ్రామ నివాసి వికలాంగుడు ముత్యాలన్న, భార్య ఇద్దరు వికలాంగులు అని, 2023వ సంవత్సరములో వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయుటకు ప్రభుత్వం అనుమతించిందని, వాటిలో భాగంగా ముత్యాలన్న తో పాటు కుక్ పోస్టుకు మరి కొంత మంది దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు చేసిన వారిలో కొంతమంది ఫేక్ సర్టిఫికెట్లు పెట్టినట్లు ముత్యాలన్న గుర్తించారన్నారు. ఈవిషయమై అప్పటి జిల్లా కలెక్టర్ గౌతమికి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడన్నారు. ముత్యాలన్న ఫిర్యాదు మేరకు ఆ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లను పరిశీలించాలని, కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడంత వేయడంతో విచారణ చేసిన సంబంధిత అధికారులు ఇవి పేక్ సర్టిఫికెట్లు అని తేల్చి వారిపై ఎటువంటి చర్యలు లేకుండా తొలగించారన్నారు. అప్పటికే పేక్ సర్టిఫికెట్లలో ఒకరికి ఉద్యోగం ఇప్పిచ్చే విధంగ ఒప్పందం చేసుకున్న ఏ సెక్షన్ లో పనిచేస్తున్న కుమారి అనే సీనియర్ అసిస్టెంట్ ముత్యలన్నను కలెక్టర్ కి ఫిర్యాదు చేశావు, నీవు ఎలా ఉద్యోగం తీసుకుంటావో నేను చూస్తా అంటూ ముత్యాలన్నా ను బెదిరిం చడమే కాకుండ దంపతులు ఇద్దరినీ చెప్పుకోలేని భాషలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న కుమారి నానాదుర్భాషలాడం జరిగిందన్నారు. ప్రస్తుత కలెక్టర్ వినోద్ కుమార్ కు రాంగ్ రిపోర్ట్ ఇచ్చి ముత్యాలన్నకి అన్ని రకాల అర్హత ఉన్న పోస్టు రాకుండా అడ్డుకున్నారన్నారు. దీనిపై ప్రస్తుత కలెక్టర్ వినోద్ కుమార్ సార్ విచారణ జరిపిం చాలని ,బాధ్యులైన సీనియర్ అసిస్టెంట్ కుమారి తో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని అంద వికలాంగుడైన ముత్యలన్న కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో విహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు జానకి రామయ్య, కళ మండలి జిల్లా అధ్యక్షులు పుల్లన్న, విహెచ్పిఎస్ మహిళ అధ్యక్షురాలు జయమ్మ , కమిటీ నాయకురాలు వరాలమ్మ ,హుస్సేన్, బి ఈశ్వరమ్మ ,కళావతి, ఎం ఎస్ పి ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, బాలరాజు, కృష్ణమూర్తి, విహెచ్పిఎస్ నగర కార్యదర్శి చెనరాయుడు తదితర వికలాంగులు నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# 5న ఫీజు పోరు ర్యాలీని జయప్రదం చేయండి

## – వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి



**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్:** రాష్ట్రంలో విద్యార్థులకు అండగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈనెల 5న చేపట్టిన ఫీజు పోరు ర్యాలీ ని జయప్రదం చేసి విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు రూ.3900 కోట్లు సాధిద్దామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, అధికారప్రతినిది చింతకుంట మధు, యసి.విభాగం అధ్యక్షులు మల్లెమిద నరసింహులు పిలుపునిచ్చారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతు గడిచిన 8 మాసాల్లో ఒక్క రూపాయి కూడా ఫీజు రియంబర్స్ మెంట్ చెల్లించకుండా రూ.3900 కోట్ల బకాయిలు పెట్టడం వల్ల విద్యార్థులపై కళాశాల యాజమాన్యం ఒత్తిడిలు ఆడికమైపోయాయన్నారు కొంతమంది విద్యార్థులు కోర్సులు పూర్తి చేసినప్పటికి ప్రభుత్వం ఫీజు రియంబర్స్ మెంట్ చెలించకపోవడంవల్ల కళాశాల యాజమాన్యం వారికి సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం తో ఎంతో మందికి ఉద్యోగాలు వచ్చిన వాటిలో చెరలేని పరిస్థితిలు ఏర్పాడ్డాయని విమర్శించారు.గతనెలలో రూ 700కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన ఒక్కరూపాయి కూడా ఇచ్చిన పరిస్థితి లేదని ఆరోపించారు. ఎన్నికల సందర్భంలో అనేక రకాలుగా హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను విద్యార్థులను వంచించిన నయవంచకుడు చంద్రబాబు నారావారి మాటలు నీటిమీద రాతల్ల మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నా అధికారంలో లేకపోయినా నిరంతరం విద్యార్థుల పక్షాన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉంటుందని పార్టీ చేపట్టిన ఫీజు పోరును విద్యార్థులు వారి తల్లిదండ్రులు. మేధావులు. ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాని జయప్రదం చేసి విద్యార్థుల వ్యతిరేక ప్రభుత్వానికి కళ్ళు తెరిపిద్దామని వారు పిలుపునిచ్చారు.

# కేంద్ర జల జీవన్ మిషన్‌తో ఇంటింటికి మంచి నీరు అందిస్తాం

## – మారెమ్మ తల్లి ఆశీస్సులతో నియోజకవర్గంలో 195 చెరువులకు నీళ్లు అందిస్తాం

## – మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి



నల్లమాడ, మేజర్ న్యూస్ :కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా అందించే నిధులతో రాష్ట్రంలోని ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.ఈరాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండే విధంగా ఈ మారెమ్మ తల్లి ఆశీస్సులు కూటమి ప్రభుత్వా నికి ,ముఖ్యమంత్రి చంద్రబాబు కు ఎల్ల ప్పుడూ ఉండాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మారెమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పెమనకుంటపల్లి తండాలో గ్రామస్తుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట ముగింపు కార్యక్రమానికి హాజరైన సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడారు. మారెమ్మ తల్లి ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం ఏడు మాసాల్లోనే ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వం లో ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సహకారంతో పోలవరం నిర్మాణానికి 12 వేల కోట్లు , అమరావతి రాజధాని నిర్మాణానికి 15,000 కోట్లు ,విశాఖ ఉక్కు కర్మాగారం కు రూ.11,917 కోట్లు కేంద్ర బడ్జెట్ కేటాయించడం హర్షణీయమన్నారు. అందులో భాగంగా పుట్టపర్తి నియోజకవర్గంలోని 195 చెరువులకు నీళ్లు ఇచ్చే కార్యక్రమానికి ఇది ఎంతో మేలు చేకూరుతుందని విశ్వాసం నమ్మకం ఉందని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి తగినన్ని నిధులు తీసుకొచ్చి రాష్ట్రంలో పుట్టపర్తి ని ఆదర్శ నియోజకవర్గం గా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ మైలే శంకర్, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సామ కోటి ఆదినా రాయణ, నాయకులు బుట్టి నాగభూషణ్ నాయుడు, రవి పేమనకుంటపల్లి తాండ గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

కదిరి టౌన్, మేజర్ న్యూస్: విద్యార్థులకు సంబంధించి వెంటనే విడుదల చేయాలని ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు రాంప్రసాద్ నాయకులు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న 3,900 కోట్లు బకాయిలను విడుదల చేసి చెల్లించాలన్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఎన్నో ఇబ్బంది పడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు ఇబ్బంది పడు తూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు చెల్లించి బడుగు వర్గాల విద్యార్థులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజులు భారం తగ్గించి పేద విద్యార్థులకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం



కదిరి రూరల్, మేజర్ న్యూస్ :పట్టణ సమీపంలోని గట్ల వద్దనున్న ఎంపీడీవో కార్యాలయం నందు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎంపీడీవో పోలప్ప నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, తాసిల్దార్ మురళీకృష్ణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు కృషి చేస్తామని తాసిల్దార్ వివరించారు.

## కోడిగుడ్లు మాయమంటూ పుకార్లు

నంబుల పూలకుంట, మేజర్ న్యూస్ :మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు స్టోర్ రూమ్ తెరిచి కోడిగుడ్లు ఐదు బస్తాల బియ్యం ఎత్తుకెళ్లారని మండల కేంద్రంలో సోమవారం పుకార్లు వినిపించాయి. ఇలాంటి పుకార్లను నమ్మవద్దని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

## దందాలకు పాల్పడితే వేటు తప్పదు

**- ఇకమీదట అధికారులపై దౌర్జన్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు**

**- అతిగా ప్రవర్తించే టిడిపి నాయకులకు దగ్గుపాటి హెచ్చరిక**



అనంతపురం, మేజర్ న్యూస్ ప్రతినిధి : తన పేరు చెప్పి ప్రజలతో కొంతమంది దందాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు... దందాలకు పాల్పడితే తమ్ముడు తనవాడైన ఉపేక్షించే పరిస్థితి లేదని ఆయన హెచ్చరించారు... ప్రజల నుండి అక్రమ వసూలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తనకు ఇతర రాష్ట్రాల్లో వివిధ కంపెనీలు ఉన్నాయని...నాకు ఓటు వేసిన ప్రజల దగ్గర నుండి అక్రమ వసూళ్లకు పాల్పడే సంస్కృతి తనకు లేదన్నారు. అధికారులపై దౌర్జన్యానికి దిగితే ఇకమీదట సహించే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు... .. ఎమ్మెల్యే చేసిన ఈ ప్రకటనతో అక్రమార్కులు, దౌర్జన్య కారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తనున్నాయి.

## ఘనంగా వసంత పంచమి



పామిడి, మేజర్ న్యూస్ : పట్టణంలోని భోగేశ్వరస్వామి ఆలయం, సరస్వతీ విద్యామందిరంలో సోమవారం వసంత పంచమిని పురస్కరించుకొని చిన్నారులకు అక్షరా భ్యాసం చేశారు. భోగేశ్వరాలయంలో సరస్వతీ ఉత్సవ విగ్రహానికి అర్చకులు రామే శ్వరశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్షరాభ్యాసం చేయించారు. అలాగే సరస్వతీ విద్యా మందిరంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలిపిన 9వ వార్డ్ కౌన్సిలర్

హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం పట్టణంలో స్థానిక చౌడేశ్వరి కాలనీ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం పద్మభూషణ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ను హిందూపురం మున్సిపాలిటీ తొమ్మిదో వార్డ్ కౌన్సిలర్ దుర్గ మంజుల, బీసీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ దుర్గా నవీన్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ దుశ్శాలువాతో పూలమాలతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంజునాథ్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు రీయంబర్స్మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను ఏడిపించడం తగదు

**- బకాయిలు వెంటనే చెల్లించాలి - నగర మేయర్ మొహమ్మద్ వసీం సలీం**

**- యాజమాన్యాల వేధింపులతో విద్యార్థులు తీవ్ర అవస్థలు**

**- పేద విద్యార్థులను విద్యకు దూరం చేయాలని కుట్రలు చేస్తున్నారు**



**అనంతపురం బ్యూరో మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు పడుతున్న అవస్థలు కూటమి ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అనంతపురం నగర మేయర్ మొహమ్మద్ వసీం సలీం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన తన చాంబర్లో సోమవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను పేద విద్యార్థులకు దూరం చేయాలనే కుట్రలో భాగంగా కూటమి ప్రభుత్వం విద్యార్థులను తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో అనేక హామీలను ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా సొమ్ము ఇవ్వకుండా ఏడిపించడం తదన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలకు సంబంధించి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారికోసం గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి లక్షల మంది విద్యార్థులకు ఉన్నత చదువులను అందించి వారు ఉన్నత స్థాయిలో ఎదిగేందుకు ఎంతో తోడ్పాటును అందించారని తెలిపారు. నేడు ఆయన అందించిన విద్య కుసుమాలు రాష్ట్రం నుంచి దేశ విదేశాలలో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వసతి దీవెన,విద్యా దీవెన పథకాల ద్వారా విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు వారిని ఉన్నత చదువులు చదివే అర్హతను కల్పించారని తెలియజేశారు. ఏ విద్యార్థి తన చదువును మధ్యలో ఆపకూడదనే ఉద్దేశంతో వారికి అన్ని విధాలుగా అండగా నిలిచారని గుర్తు చేశారు. వసతి దీవెన విద్యా దీవెన కు సంబంధించి కూటమి ప్రభుత్వ నేతలు ఎన్నికల ముందు ఎలక్షన్ కమిషన్ ఆశ్రయించి విద్యార్థులకు అందించాల్సిన బకాయిలను అందించకుండా అన్ని విధాలుగా అడ్డుపడ్డారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవంబర్లో ఎక్స్ ద్వారా తన పోస్టును పెట్టారన్నారు. దానికి స్పందించిన కూటమి ప్రభుత్వ మంత్రులు బకాయిలను వెంటనే విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్న ఇప్పటివరకు వాటి ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలు 20 లక్షల ఉద్యోగాలు నిరుద్యోగ భృతి, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం,తల్లికి వందనం వంటి అనేక పథకాలను ప్రజలకు చెప్పి వాటిని అమలు చేయడంలో మాత్రం ఏడు నెలలు దాటినా ఒక్క పథకాన్ని కూడా అందించలేని పరిస్థితుల్లో ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యతను కల్పించి తమ ప్రభుత్వం అన్ని విధాలుగా విద్యార్థులను ఆదుకున్న విషయాన్ని తెలియజేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులను విద్యను దూరం చేయాలనే ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఫీజు రియంబర్స్మెంట్ రాక అనేకమంది విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదనను వ్యక్తం చేశారు. వారి బకాయిల ఇబ్బందులతో విద్యార్థులు మానసికంగా సతమతము అవుతున్నారని తెలిపారు. యాజమాన్యాలు చేస్తున్న ఒత్తిడి కారణంగా అనేకమంది విద్యార్థులు చదువులో వెనుకబాటుకు గురవుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితికి కూటమి ప్రభుత్వమే ప్రధాన కారణమని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వెంటనే బకాయి పడ్డ 3900 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేసి విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈనెల 5వ తేదీన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు అనంతపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి నేతృత్వంలో అనంతపురం జిల్లా కేంద్రంలో ఫీజు పోరు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ జమ చేయడంలో జరుగుతున్న జాప్యం వల్ల పేద విద్యార్థులు,వారి తల్లిదండ్రులు అవమానాలకు గురి అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, మల్లె మీద నరసింహులు, శ్రీనివాసులు, అనిల్ కుమార్ రెడ్డి,కమల్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ పథకం అమలు చేయని కిమ్స్ సవేరా హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలి - సిపిఐ



**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్ :** ఆరోగ్యశ్రీ ఉన్నప్పటికీ వైద్యం అందించని సవేరా హాస్పిటల్ పై చర్య తీసుకోవాలని సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో డిఆర్ఓ మాలోలకు సిపిఐ నగర కార్యదర్శి ఎన్ శ్రీరాములు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవేరా ఆసుపత్రిలో హార్ట్ ఎటాక్ కు గురైన ఒకరికి ఆరోగ్యశ్రీ కింద చికిత్స ఇవ్వమని చెప్పమన్నా రని చెప్పి,మీరు వేరే హాస్పిటల్ లకు వెళ్లవల సిందిగా చెప్పి ఆమె ను రాత్రి 2 గంటలకు ఎమర్జెన్సీ చేర్చుకున్నందుకు 5,000 రూపాయలు డబ్బులు కట్టించుకుని డిశ్చార్జ్ చేశారన్నారు. అత్యవసరంగా ఉన్నప్పుడు చికిత్స ఇవ్వాల్సిందిగా ప్రభుత్వ నిబంధన ఉన్నప్పటికీ ప్రాణాలు పోతున్నా లెక్కచేయ కుండా చివరి క్షణాల్లో మార్క్ హాస్పిటల్ లో చేర్పించగా అక్కడ ఆరోగ్యశ్రీ కింద ఆమె కు చికిత్స ఇవ్వడం జరిగిందన్నారు. చికిత్స ఇవ్వకుండా వారి తో డబ్బులు వసూలు చేసిన సవేరా హాస్పిటల్ పైన చర్యలు తీసుకొని,పేద ప్రజలను నట్టి విడుస్తున్న ఈ హాస్పిటల్ లపై లైసెన్స్ క్యాన్సిల్ చేయాలని చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిఆర్ఓ మాలోల స్పందిస్తూ వెంటనే డిఎంహెచ్ఓ ఈ. బి. దేవి, ఆరోగ్యశ్రీ ఆర్డినేటర్ కిరణ్ కుమార్ కి పిలిపించి చెప్పడంతో డి ఎం అండ్ హెచ్ ఓ వెంటనే షోకాస్ నోటీసు సవేరా హాస్పిటల్ పంపిస్తా నని చెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు సహాయ కార్యదర్శులు రమణ, అల్లిపీర, ఏ.ఐ.వై.ఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్, ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి బంగారు బాషా, నగర కార్యవర్గ సభ్యులు రామంజి, సుందర్ రాజ్ , శ్రీనివాస్ అనంతపురం ఇస్కాఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు చాంద్ భాషా, ఖాజా మొహిద్దీన్, మున్సనాఫ్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు ఆనందు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## యోగాను పాఠశాల స్థాయి నుంచి క్రీడగా గుర్తింపునకు విజ్ఞప్తి

అనంతపురం విద్య మేజర్ న్యూస్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ను అనంతపురం యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ తరఫున సన్మానించారు. ఈ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వ క్రీడల శాఖ చే గుర్తింపు ఉన్నది. ఆయన పర్యటనలో భాగంగా ఇండోర్ స్టేడియంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అనంతపురం అధ్యక్షులు ఎం.రాజశేఖర్ రెడ్డి , వై ఆంజనేయులు కోశాధికారి.ఇతర సభ్యులు న్.దివాకర్ , గురు రాజారావు తారక్ రామయ్య మొదలగు సభ్యులు కలసి యోగా ని రాష్ట్ర జిల్లా స్థాయిలో శాప్ లో ఈ అసోసియేషన్ గుర్తింపునిచ్చి యోగాను ఒక క్రీడగా గుర్తింపును ఇచ్చి ఈ యోగ సిలబస్ ని అన్ని పాఠశాల లో బోధించే విధముగా, ఒక క్రీడగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. వాటినీ అంగీకరించి, అనుమతులకు సంబంధించిన అవసరమైన పత్రములు సమర్పించమని తెలియజేశారు. అధికారికంగా వాటికి కావలసిన అనుమతులు ఇవ్వగలమని, జిల్లా స్థాయి లో కూడా గుర్తింపు ఇచ్చి ప్రోత్సహించగలమని తెలియజేశారు. యోగా కేంద్ర సభ్యులు మెమెంటో, శాలువతో వారిని సత్కరించారు .

## బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పొడిగించాలని ఆర్డీవోకు వినతి



కదిరి, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా బీసీ కులాల వారికి సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోందని, దరఖాస్తు ఆఖరి తేదీ ఈ నెల 7వ తేదీ అని మరికొన్ని రోజులు గడువు పొడిగించాలని కోరుతూ కదిరి ఆర్టీవో ఎన్ వి ఎస్ శర్మ కు సోమవారం నాయి బ్రాహ్మణ ,రజక సంఘం, అంబేద్కర్ సేవా సమితి సభ్యులు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2024 25 సంవత్సరానికి గాను బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేసిందని అయితే గడువు తక్కువగా ఉండటం వల్ల ఎక్కువమంది దరఖాస్తు చేయించుకోలేక పోయే అవకాశం ఉందని, గడువు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆర్డీవోను కోరినట్లు నాయకులు తెలిపారు. నీతి పత్రం అందజేసిన వారిలో హరిప్రసాద్ ,రమణ, శ్రీనివాసులు, ముని కుమార్, గంగన్న , శంకర వేణు ,ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య



రాయదుర్గం, మేజర్ న్యూస్: గాలిచేష్టలు సోకి , ఆరోగ్యం క్షీణించడంతో మనస్థాపానికి గురైన వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య కు పాల్పడిన సంఘటన మండలం లోని టి. వీరాపురం గ్రామంలో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు ...చాకలి సుంకన్న, నాగమ్మ ల పెద్ద కూతురు జయంతి(20) కి గత కొంత కాలంగా గాలి చేష్టలు సోకాయి. వివాహం చేస్తే కోలుకుంటుందనే ఉద్దేశ్యం తో నాలుగు నెలల క్రితం కదరంపల్లి గ్రామానికి చెందిన తల్లి తమ్ముడు (మేనమామ)కు ఇచ్చి వివాహం చేశారు. అయినా తరచూ గాలిచేష్టలు సోకి ఇబ్బంది పడేది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు వేసుకుని ఉరివేసుకుని ఆత్మహత్య కు పాల్పడినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న అర్బన్ సీఐ జయానాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి , పోస్టుమార్టం నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి నాగమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# సోషల్ వెల్ఫేర్ డీడీపై చర్యలు తీసుకోవాలి

### – జిల్లా కలెక్టర్‌కు విహెచ్‌పిఎస్, ఎమ్మార్పీఎస్, పిఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్లకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించిన, స్థానికంగా నివాసం లేకుండా హాస్టల్స్ పర్యవేక్షణ ను గాలికి వదిలేసిన అనంతపురం జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి హెచ్. పెద్దన్న, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రతిభ భారతి, ఎమ్మార్పీఎస్ నేత సామ్రాట్ కె.మధు మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రామాంజనేయులు సోమవారం గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ గా పనిచేస్తున్న ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి జిల్లాకు వచ్చి మూడు నెలలు అవుతున్నప్పటికీ స్థానికంగా నివాసం లేకుండా హాస్టల్స్ పర్యవేక్షణను గాలికి వదిలేశారన్నారు. డీడీ కొన్ని రోజులు లాడ్జ్ లో ఉంటూ వాటి ఖర్చులకోసం ఒక్కొక్క వార్డెన్ తో రూ.1000 రూపాయలు చొప్పున అక్రమంగా వసూలు చేసినట్లు మాదృష్టికి వచ్చిందన్నారు. అదే విధంగా హాస్టల్స్ లో ఉంటున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే డైట్ చార్జీల్లో కూడా ఒక నెలకు ఒక్కో విద్యార్థికి రూ.50 లు చొప్పున అందరు విద్యార్థులకు కలిపి మూడు నెలలకు ఒకేసారి వార్డెన్ల నుండి వసూళ్లు చేసి ఇవ్వాలని కొందరు వార్డెన్లపైన ఒత్తిడి చేసినట్లు తెలిసిందన్నారు. అదేవిధంగా ఒక మండలానికి రూ. 5000 చొప్పున జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇందులో పామిడి మండలంలో పనిచేస్తున్న ఒక వెల్ఫేర్ అసిస్టెంట్, జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. నార్పల ఎస్సీ హాస్టల్ ఇన్చార్జి బాధ్యతలను పక్కన ఉన్న వార్డెన్లకు బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయని, కాని డీడీ తన సామాజిక వర్గానికి చెందిన వార్డెన్ కు ఇం



చార్జ్ బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా జిల్లా కేంద్రంలో విజిలెన్స్ కేసు ఉన్న ఎస్సీ బాయ్స్ కాలేజ్ హాస్టల్ వార్డెన్ భాస్కర్ రెడ్డికి ఇన్చార్జి బాధ్యతలు అప్పగించా రని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ను కూడా బురిడీ కొట్టించారన్నారు. డీడీ తన కింద స్థాయి అధికారులు, ఉద్యోగులు, వార్డెన్ల పట్ల కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. అంతే కాకుండా జిల్లా వ్యాప్తంగా చాలా మంది 4వ తరగతి ఉద్యోగులు పదుల సంఖ్యలో ఉన్నప్పటికీ, గత ఏడాది ఉత్తమ అవార్డు తీసుకున్న అటెండర్ ప్రసాద్ కే ఈ ఏడాది కూడా (జనవరి 26) న అవార్డు ఇవ్వడం జరిగిందని, ఈ అటెండర్ తన వ్యక్తిగత పనులు చేస్తున్నందుకే డీడీ అవార్డు కు ప్రతిపాదనలు పంపారని ఆరోపించారు. అంతే కాకుండా డీడీ అక్రమ వసూళ్ల విషయాన్ని వార్డెన్లు బయటకు లీక్ చేశారని వారిపై అనుమానంతో కొంతమంది వార్డెన్లను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఇలాంటి డీడీ పైన వస్తున్న ఆరోపణల పైన విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ చేసి ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రామాంజనేయులు, నాయకులు కృష్ణమూర్తి, జయలక్ష్మి, సాకే జానకిరామ్, చంద్ర రాయుడు, వరాలమ్మ, హుస్సేన్ బి, నాగేంద్ర, పిఎస్ ఎఫ్ఐ నాయకులు జ్యోతి, బాలు తదితరులు పాల్గొన్నారు.

# 109 మంది దంపతులతో 109 కలశాలతో 109 హోమాలతో మహా యజ్ఞం..

**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్ :** శ్రీశ్రీశ్రీ పరమ పిత శ్రీ వెంకటరమణాచార్య గురువు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేకే అగ్రహారం పంచాయతీ సంజీవపురం గ్రామ సమీపంలో గల ఆశ్రమంలో గురువుగారి 14వ వార్షికోత్సవం లో భాగంగా సోమవారం చివరి రోజు 109 మంది దంపతులతో 109 కలశాలతో 109 హోమాలును పరమ స్థానమ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీ యోగి ముక్తేశ్వరి మాతాజీ , శ్రీ మోక్షి ముక్తేశ్వరి మాతాజీ ఆధ్వర్యంలో విశిష్ట మోక్ష స్థిత కలశ పూజ మరియు మహా యజ్ఞం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏఎస్పీ మల్లికార్జున వర్మ, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ,అడ్వకేట్ పద్మజా , ఆకుల రాఘవేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మల్లికార్జున వర్మ మాట్లాడుతూ ఈ పరమ సంస్థానం ట్రస్ట్ చేయు సేవలు చాలా బాగున్నాయని, మున్ముందు ఇలాగే కొనసాగాలని, ఇలాంటి లోక కళ్యాణం కోసం చేసే యజ్ఞయగాలు మరిన్ని చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం చేయు ఈ మహా యాగం వలన సకల



జనులు సుభిక్షంగా ఉండాలని, ఆయు ఆరోగ్యాలు కలగాలని , సమస్త జనులు, సకల జీవులకు సేవ చేయటం వలన ఆ పరబ్రహ్మ కృప ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్, కార్యదర్శి రామాంజనేయచారి, ఉప కార్యదర్శి మల్లికార్జున ,ట్రెజరర్ నాగభూషణ కన్వీనర్ మణిజ్ఞాన ,కరెంట్ ఏడి రఘు, ఏఈ నీలకంఠ , శిష్య బృందం, భక్తిశ్రద్ధలతో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలి : సిపిఐ

ఓబులదేవరచెరువు, మేజర్ న్యూస్ : మండల వ్యాప్తంగా అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని సోమవారం సిపిఐ నాయకులు మండల తహసీల్దార్ అనంత చారి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ అర్హులైన నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న టువంటి ఇళ్ల, స్థలాల సంబంధించి చాలామంది అవకాశం కోల్పోతారని అర్హులందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు రావాలంటే కొత్తగా పెళ్లయిన వారికి రేషన్ కార్డులు ఇప్పటికే పెళ్లయిన వారికి విభజన మార్పులు చేర్పులు చేసి అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని కోరారు రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్షణమే రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చలపతి, రైతు సంఘం నాయకులు పూల శ్రీనివాసులు, మహిళా సంఘం నాయకురాలు రత్నాబాయి,



సిపిఐ నాయకులు గంగులప్ప,రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బాలకృష్ణకు శుభాకాంక్షలు

### – ఎన్‌బికె ఫ్యాన్స్ టౌన్ ప్రెసిడెంట్ బండారు బాలాజీ



హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం పట్టణంలో స్థానిక చౌడేశ్వరి కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమ వారం పద్మభూషణ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ను టౌన్ ఎన్ బి కే ఫ్యాన్స్ ప్రెసిడెంట్ బండారు బాలాజీ మర్యాదపూర్వకం గా కలిశారు. ఈ సందర్భంగా తను అభిమానించే ఆరాధ్య దైవం నందమూరి హీరో ఎమ్మెల్యే బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ పూల బొకే అందించి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 18 వినతులు



పరిగి మేజర్ న్యూస్:పరిగి మండలం తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 18 వినతులు వచ్చాయని తాసిల్దార్ హసీనా సుల్తానా తెలిపారు. అందులో ఎల్ఆర్బిడి 5 రైతులకు సంబంధించి 11 భూమి సమస్యలకు సంబంధించి 2 ఎల్ ఆర్ బిడికి సంబంధించిన ఎంక్వయిరీకి రెవిన్యూ ఇన్స్పెక్టర్కు ఆదేశించామని రైతులకు సంబంధించిన సమస్యలను అక్కడే పరిష్కరించడం జరిగింది భూమి సమస్యల సంబంధించి బీరేపల్లి నుంచి ఒకటి పరిగి నుంచి ఒకటి వినతులు స్వీకరించి వాటి సమస్యల పరిష్కారం దిశగా ఆన్లైన్ పిజిఆర్లో నమోదు చేసామని తెలిపారు.

## కూటమి వచ్చాకనే రోడ్లకు మోక్షం వచ్చింది

- రోడ్డు పరిశీలనలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- రుద్రంపేట పంచాయితి బ్యాంకు కాలనీలో నూతనంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం
- పనుల్లో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు ఉండాలని సూచన

అనంతపురం మేజర్ న్యూస్ ప్రతినిధి : కూటమి ప్రభుత్వం వచ్చాకనే రాష్ట్రంలో రోడ్లకు మోక్షం వచ్చిందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలోని రుద్రంపేట పంచాయతీ బ్యాంక్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లను ఆయన పరిశీలించారు. అక్కడి కాంట్రాక్టర్, స్థానిక నాయకులతో మాట్లాడారు. పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని ఆరా తీశారు. పనుల నాణ్యతలో ఎక్కడా లోపం ఉండకూడదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా చోట్ల రోడ్ల సమస్య ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొన్ని ప్రాంతాలను పూర్తిగా విస్మరించారన్నారు. అందుకే ఎక్కడ రోడ్డు అవసరం ఉన్నా వెంటనే అంచనాలు పంపుతున్నామన్నారు. నగరంతో పాటు నాలుగు పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్య లేకుండా చేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నగారాభివృద్ధి వేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కొనంకి గంగారామ్, టీడీపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, టిడిపి నాయకులు భక్తవత్సలం నాయుడు, గోపాల్ గౌడ్, సింగమనేని రామాంజినేయులు, కడియాల కొండన్న, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్ల మరమ్మతులు తప్ప వేరొక అభివృద్ధికి నోచుకోని హిందూపురం

### – వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ దీపికా వేణు



హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం పట్టణంలో సోమవారం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త టిఎన్ దీపిక తన కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వైసిపి కౌన్సిలర్లను ప్రలోబాలకు గురిచేసి మా పార్టీ కౌన్సిలర్లను కొని వారి పార్టీలోకి చేర్చుకున్నారన్నారు. ఇలా చేయడం వల్ల చైర్మన్ ఎన్నికకు మెజారిటీ ఓట్లు వచ్చాయన్నారు. అయితే పార్టీని వీడి టిడిపిలోకి వెళ్లిన కౌన్సిలర్లకు ఇది వారి రాజకీయ జీవితానికి ఫుల్ స్టాప్ అని అన్నారు. ఇప్పటికీ పార్టీలో కొనసాగుతున్న మిగతా కౌన్సిలర్లను ఆమె అభినందించారు. ఇదంతా మున్సిపల్ చైర్మన్ ను ఎన్నుకోవడానికి టిడిపి చేసినటువంటి కుట్ర అని ఆమె అన్నారు. చైర్మన్ ఎన్నిక కార్యక్రమానికి వైసీపీ పార్టీ ఆఫీసు నుండి మేము బయలుదేరగా మమ్ములను పోలీసులు అడ్డుకొని బలవంతంగా ఆపివేశారన్నారు. టిడిపి ఈ విధంగా మమ్ములను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇది ఏ మాత్రం మంచి పద్ధతి కాదని తమ విధానాలు మార్చుకోవాలన్నారు. ఇప్పుడు మీరు అధికారంలో ఉండొచ్చు ఈసారి మేము అధికారంలోకి కచ్చితంగా రావడం జరుగుతుందని ఈ విషయాన్ని మీరు గుర్తుంచుకొని వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ తన తండ్రి పేరు చెప్పుకొని ఎమ్మెల్యేగా గెలిచారని అయితే ఆయన ఇక్కడ ఉండకుండా తన పిఏ ల ద్వారా పరిపాలన చేయడం ఎంతవరకు సరైన పద్ధతిని అన్నారు. కేవలం రోడ్ల మరమ్మత్తులు తప్ప వేరొక అభివృద్ధి కార్యక్రమం ఎమ్మెల్యే చేయించింది లేదని ఆమె పేర్కొన్నారు. సోమవారం చైర్మన్ ఎన్నిక కార్యక్రమం ఉండగా నిబంధనలను ఉల్లంఘించి ఆదివారం సాయంత్రం నుండే డిఈ రమేష్ కుమార్ చైర్మన్గా ఎన్నికైనట్లు ఫ్లెక్సీలు భారీ ఎత్తున మున్సిపల్ ఆఫీస్ నందు వేయించారన్నారు. మమ్మల్ని అయితే పార్టీ కార్యాలయం నుండి కూడా బయటికి రాకుండా అడ్డుకొని టిడిపి నాయకులను కౌన్సిల్ హాల్ వరకు కూడా వెళ్లడానికి అవకాశం కల్పించారని. దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ కూడా బయటకు తీపిస్తామని అన్నారు. టిడిపి వారు చేస్తున్నటువంటి ఈ యొక్క అక్రమ రాజకీయ విధానాలను పుర ప్రజలు చూస్తున్నారని రాబోయే రోజుల్లో టిడిపి వారికి పట్టణ ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ





యల్లనూరు,మేజర్ న్యూస్ : శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు మండలం, చిలమకూరు గ్రామ సమీపంలో 33/11కె.వి. విద్యుత్ సామర్థ్యం గల సబ్ స్టేషన్ ను నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో మొట్ట మొదటిసారిగా విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సబ్ స్టేషన్ ఎర్పాటుతో చిలమ కూరు, అచ్యుతాపురం, తిరుమలాపురం, కోడుమూర్తి గ్రామాల్లోని 850 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, 600 గృహ విద్యుత్ కనెక్షన్లు కు విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందుతుందని.గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి పోయాయి, కానీ కూటమి ప్రభుత్వంలో మొదటిసారి ఈ ప్రాంతంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు అవడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు,పలువురు రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ గంగమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం



హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం పట్టణంలోని శ్రీ కంఠాపురం పులమతి రోడ్‌లో వెలసిన శ్రీ గంగమ్మ దేవాలయం ద్వితీయ వార్షికోత్సవము ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవంలో సోమవారం ఉదయం గణపతి హోమము, నవగ్రహ హోమము, దుర్గ సూక్త హోమం, సుదర్శన హోమం, ఆయుష్ హోమం, సాధుణ్య దేవతా హోమం, మృత్యుంజయ హోమము, గంగాదేవికి పంచామృత అభిషేకము అలంకరణ, షోడశ ఉపచార పూజ, లాంచన మంగళహారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతి, ప్రధాన దేవత కలశములకు హారతి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ గంగమ్మ దేవి ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులైనారు.

# ‘ఫీజు పోరు’కు సిద్ధం

## – వైసీపీ అనంతపురం జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు బీసీ రమేష్‌గౌడ్

### – మద్దతు తెలిపిన ఐక్య విద్యార్థి సంఘాలు – స్వచ్ఛందంగా విద్యార్థులు, తల్లిదండ్రులు తరలిరావాలని పిలుపు



**అనంతపురం బ్యూరో మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురవుతున్న విద్యార్థులకు అండగా ఉండేందుకు ఈనెల 5న (బుధవారం) వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టనున్న ‘ఫీజు పోరు’కు సిద్ధంగా ఉన్నామని ఆ పార్టీ అనంతపురం జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు, బీసీ సెల్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి రమేష్ గౌడ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వీ, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర, జీవీఎస్ఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మల్లికార్జున నాయక్, గిరిజన విద్యార్థి నాయకులు లక్ష్మీపతి నాయక్, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షులు బిల్లే జగదీష్, ఎస్వీఎస్ఎఫ్ బీసీ చక్రధర్ యాదవ్, హర్ష, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జెన్నే చిరంజీవి, బీసీ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కేశవ గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రూ.3900 కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 5న అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. సప్తగిరి సర్కిల్, సూర్య నగర్ మీదుగా కలెక్టరేట్ వరకు చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందివ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం విద్యను కూటమి ప్రభుత్వం రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం వద్దంటూ తెలుగు మహాసభల్లో కూటమి నేతలు, మేధావులు అని చెప్పుకునే మాజీ సుప్రీంకోర్టు జడ్జి ఎంవీ రమణ, రామోజీరావు కోడలు శైలజా కిరణ్ తదితరులు మాట్లాడటం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. కేవలం ఇలాంటి తెలుగు మహాసభల్లో మాత్రమే తెలుగు ముద్దు.. ఇంగ్లీష్ వద్దు.. అంటారు కానీ, స్వయానా రామోజీరావు కోడలు శైలజా కిరణ్ నడుపుతున్న రమాదేవి పబ్లిక్ స్కూలులో తెలుగు సబ్జెక్టు లేకుండా జర్మన్, ఫ్రెన్స్, రష్యన్ మొత్తం ఇంగ్లీష్‌లోనే మాట్లాడేలా నడుపుతున్నది నిజం కాదంటారా.. ధనవంతుల పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలి.. పేద పిల్లలు ఇంగ్లీషులో చదవకూడదా అంటూ రమేష్ గౌడ్ ప్రశ్నించారు. కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాలకు చెందిన పేద పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చదువుకోకుండా.. డబ్బున్నటువంటి, మీలాంటి ఇళ్లలో పాచి పనులు చేయాలా.. అంటూ నిలదీశారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం రూ.1780 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిపోతే వైఎస్ జగన్ సీఎం కాగానే ఆ బకాయిలను విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 37 వేల పైచిలుకు పాఠశాలలను నాడు%-%నేడు పథకం కింద అభివృద్ధి చేసి.. కార్పొరేట్ దీటుగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి పేద విద్యార్థులకు పెద్దపీట వేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. తాజాగా ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. లేకపోతే పరీక్షలకు సైతం అనుమతించేది లేదని తేల్చి చెబుతు



న్నారన్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. కొన్ని చోట్ల ఫీజుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలోనే విద్యార్థులకు అండగా వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో ‘ఫీజు పోరు’ నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. సమావేశంలో వైసీపీ నాయకులు బెస్త వెంకటేష్, చంద్ర, నరసింహులు, నాగేంద్ర, వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లబ్బె రాఘవ, వంశీ, మోహన్, గణేష్, మారుతి, బాలాజీ, వినీత్, రోహిత్ కుమార్, చిన్న, హరీష్, మణికంఠ, విద్యార్థి విభాగం నగర అధ్యక్షులు కైలాష్, వైసీపీ నాయకులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

### బీసీ హాస్టళ్లలో వసతులు కల్పించాలి

**– కేశవ, జిల్లా అధ్యక్షులు, బీసీ విద్యార్థి సంఘం**

జిల్లాలో బీసీ వసతి గృహాలతోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఉర్దూ వసతి గృహాల్లో కూడా మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కేశవ పేర్కొన్నారు. అంతేకాకుండా ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం తో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురికావాల్సి వస్తోందన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ నిర్వహించనున్న ఫీజు పోరుకు బీసీ విద్యార్థి సంఘం పూర్తి మద్దతు తెలుపుతోందని కేశవ తెలిపారు.

### ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**– జెన్నే చిరంజీవి, రాష్ట్ర అధ్యక్షులు, ఎంఎస్ఎఫ్.**

నారా లోకేశ్ యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న సమయంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని, ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతి దీవెన కల్పిస్తామని హామీనిచ్చారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ ఉన్నారని, ఆయన ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జెన్నే చిరంజీవి డిమాండ్ చేశారు. ప్రస్తుతం విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు పెండిరగ్‌లో ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యకు దూరం కావాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల కోసం వైసీపీ తలపెట్టిన ఫీజు పోరుకు మద్దతు తెలుపుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

### ఫీజు బకాయిలు విడుదల చేయాలి

**– మల్లికార్జున నాయక్, జాతీయ ఉపాధ్యక్షులు, గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం**

విద్యార్థుల ఫీజు బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మల్లికార్జున నాయక్ డిమాండ్ చేశారు. 5న వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టబోయే ఫీజు పోరుకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

### ఫీజు పోరుకు మద్దతిస్తున్నాం..

**– మంజుల నరేంద్ర, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఫీజు పోరుకు పీఎస్‌యూ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర తెలిపారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. వెంటనే ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



### వైసీపీ ఫీజు పోరుకు మద్దతిస్తున్నాం

**– పాపిరెడ్డిపల్లి పృథ్వీ, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐఎస్‌బీ**

వైసీపీ ఫీజు పోరుకు తమ బ్లాక్ మద్దతు తెలుపుతోందని ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వీ తెలిపారు. పెండిరగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతి దీవెన వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నారా లోకేశ్ యువగళంలో తాము అధికారంలోకి వస్తే.. విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీనిచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు ఆ హామీలు నెరవేర్చలేదని ప్రశ్నించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతి దీవెన విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాపోయారు. ఈ క్రమంలో వైసీపీ చేపట్టబోయే ఫీజు పోరుకు తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు.

### విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

**– చంద్రశేఖర్ యాదవ్, జిల్లా అధ్యక్షులు, వైఎస్ఆర్ ఎస్‌యూ**

అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక విస్మరించారని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ ఆరోపించారు. విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వ అనైతిక వైఖరిని ఖండిస్తూ.. వైఎస్ఆర్సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆందోళనకు పిలుపునిచ్చినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం విద్యను కూటమి ప్రభుత్వం రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ చేపట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### ఎలాంటి ఆలస్యం కాకుండా

# పిజిఆర్ఎస్ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**



**అనంతపురము మేజర్ న్యూస్:** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఓ ఎ.మాలోల, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, శిరీష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 418 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఇందులో భాగంగా ప్రజల వద్దకే వెళ్లి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పిజిఆర్ఎస్ లో వచ్చిన సమస్యలను ఎలాంటి ఆలస్యం కాకుండా ఎప్పటికప్పుడు నాణ్యత కలిగిన పరిష్కారం చేయాలన్నారు. అర్జీల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం 10.02.2025 , మాప్ -అప్ 17.02.2025,పోస్టర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ విడుదల చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, అనంతపురము ఆధ్వర్యంలో నులిపురుగులు సోకిన పిల్లలు, కిశోర బాలల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే వివిధ ప్రమాదకరమైన అరోగ్య సమస్యలను ఎదుర్కొంటారన్నారు. రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నిరసం మరియు శరీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారని, జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమము రోజులలో డి వార్మింగ్ చేయబడిన పిల్లలకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఈనెల 10. 02.2025, 17.02.2025 మాప్ -అప్ రోజుల్లో అల్బేండజోల్ 400 మి.గ్రా. మాత్రలు అన్ని అంగన్వాడీలు, పాఠశాల లు, కళాశాలలో ఉచితంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, అనంతపురము వారిచే పంపిణీ చేపడతాయని తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు -2025 లో భాగంగా గత నెల 16.01. 2025 తేదీ నుండి 15.02.2025 తేదీ వరకు "రహదారి భద్రతా ప్రచారం - ప్రయాణంలో శ్రద్ధ వహించండి "కార్యక్రమం చేపట్టడం జరిగిందని ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు, నిబద్ధతతో పాటిస్తానని జిల్లా అధికారులు అందరితో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ ఆర్.రామచంద్ర రెడ్డి, సిపిఓ అశోక్ కుమార్, పశుసంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, డ్వామా పిడి సలీమ్ భాష, డిఆర్డిఏ పిడి ఈశ్వరయ్య, ఐసిడిఎస్ పిడి వనజా అక్కమ్మ, హార్టికల్చర్ డిడి నరసింహారావు, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ సంపత్ కుమార్, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, డిటిసి వీర్రాజు, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి, హౌసింగ్ పిడి శైలజ, సర్వే ఏడి రూప్ల నాయక్, ఎల్డిఎం నర్సింగరావు, మైన్స్ డిడి వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ ఎడి సత్యనారాయణ చౌదరి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, డిఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి వినోద్,డీఈవో ప్రసాద్ బాబు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యరావు, పి జిఆర్ ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు యుగేశ్వరి దేవి, వసంతలత, తదితరులు వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## వడ్డే వెంకటేశులును సన్మానించిన భద్రకాళి ఆలయ సభ్యులు

అనంతపురం విద్య మేజర్ న్యూస్ : వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన వడ్డే కుంచపు వెంకటేశులును భద్రకాళి సమేత ఈర్లయ్యస్వామి ఆలయ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలు కప్పి పూలమాలతో సన్మానించారు. రాప్తాడు నియోజకవర్గం గొందిరెడ్డిపల్లిలో వెలసిన శ్రీ భద్రకాళి సమేత ఈర్లయ్యస్వామి ఆలయ సభ్యులు వెంకటరాముడు, రాజన్నల ఆధ్వర్యంలో వడ్డే కుంచపు వెంకటేశులును సన్మానించిన అనంతరం వడ్డెర కులదైవమైన ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. దీనికి వడ్డే వెంకటేశులు స్పందించి ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అలాగే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిలకు ఈ విషయం తెలియజేసి.. ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చేలా చూస్తామని తెలిపారు. వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో గోవిందు, రామంజి, పెద్దన్న, నాగరాజు, ఎర్రిస్వామి, ముత్యాలు, ప్రకాష్, రాజు, రామాంజనేయులు, రమణ, సుధాకర్, లక్ష్మన్న పాల్గొన్నారు.

## సరస్వతి విద్యా మందిరంలో ఘనంగా అక్షరాభ్యాసం



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : శ్రీ సరస్వతీ విద్యా మందిరం అనంతపురం పాఠశాలలో వసంత పంచమిని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా, ఆత్మీయ అతిథిగా నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్. ఎస్. నిర్మల మురళీ విచ్చేసి చిన్నారులను దీవించి, సంస్కారవంతమైన విద్యను తల్లిదండ్రులు అందించాలని మార్గదర్శనం చేశారు. అక్షరాభ్యాసం అనంతరం తల్లిదండ్రులు ఎలా ప్రవర్తించాలో అనే అంశంపై ప్రసంగించారు. ఇందులో భాగంగా కార్యక్రమానికి దాదాపు 60 మంది చిన్నారులతో తల్లిదండ్రులు హాజరై కమిటీ సభ్యులు, ప్రభంధకారిణీ సభ్యులు అయిన వి సి నరసింహులు (అడ్మినిస్ట్రేటివ్ ఎక్జిక్యూటివ్), ఎస్ బద్రీనాథ్, లక్ష్మన్న, డి వెంకటేశ్వర్లు, ఆళ్లగడ్డ రాము, వరలక్ష్మి, కె రాఘవయ్య, డాక్టర్ విజయ్ సాయి ఆధ్వర్యంలో హోమం నిర్వహించి, పండితుల చేతుల మీద చిన్నారులకు ఓం నమఃశివాయ అని రాయించారు. ఈ వేడుకలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపక బృందం, యూట్యూబర్ మహిత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరిగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలతో కార్యక్రమాలు ఘనంగా ముగిసింది.

# తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ధర్నా



కనేకల్లు, మేజర్ న్యూస్ : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కనేకల్ మండలం ఎమ్మార్వో కార్యాలయం నందు లబ్ధిదారులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏపీ రాష్ట్ర సిపిఐ పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో హామీలపై గళం ఎత్తాలని పిలుపు ఇవ్వడముతో కనేకల్ మండలం సిపిఐ మండల కార్యదర్శి ఎం గౌస్ పీర్, మండల సహాయ కార్యదర్శి ముళ్ళ సర్మాస్‌వలి, ఎస్ బషీర్ అహ్మద్ పట్టణ కార్యదర్శి మాట్లాడుతూ కనేకల్ మండల వ్యాప్తంగా అనేక సమస్యలపై సిపిఐ నాయకులతో మండల వ్యాప్తంగా గ్రామాల్లోని ప్రతి ఇంటింటికి పోయి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల మహిళలకు అడగగా ఆరా తీయగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తి అవుతుంది కానీ కేవలం రుద్దపు పింఛన్లు రూ.3వేలు నుండి రూ.4వేలుకు మరియు వికలాంగుల రూ.4వేలు నుండి రూ.6వేలు కు పింఛను పెంచారు. అందులో భాగంగా ఉచిత సిలిండర్ లు తప్ప ఆరు పథకాల్లో మిగిలిన పథకాలు అర్హులు ఉన్న నిరుపేదలకు ఇంటి స్థలాలు గ్రామంలో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్లు అందులో భాగంగా ప్రతి పేదవానికి ప్రభుత్వం ద్వారా ఇల్లు నిర్మాణంకు రూ.4లక్షల రూపాయలు పథకం అమలు చేయాలి, సంక్రాంతికి కానుకగా ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అది కూడా అమలు చేయాలి మరియు తల్లికి వందనం ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉన్నా బడికి పోయే ప్రతి పిల్లవానికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రతి మహిళ 18 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ.15వందలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ లేవుట్లలో మౌలికో వసతులు రోడ్లు నీరు విద్యుత్తు స్తంభాలు అమర్చి విద్యుత్ సరఫరా చేయాలి, ప్రతి అంగన్వాడి టీచర్లకు ఆయనకు కనీస వేతనం టీచర్లకు రూ.25వేలు, ఆయాలకు 20 రూపాయలు ఉండాలని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆశ వర్కర్లకు కూడా జీతభత్యం పెంచాలని వారికి కూడా ఉద్యోగ భద్రత కల్పించాలి, ఎన్నికల ముందు అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న వంటి చంద్రబాబు నాయుడు మేము అధికారంలో వస్తే ఇవన్నీ పథకాలు అమలు చేస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. మన రాష్ట్ర జనాభా ఐదు కోట్ల మంది ప్రజలు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీ ఇచ్చి అధికారం ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తి చేసుకున్న కేవలం రెండు పథకాలు మాత్రమే అమలు చేశారు. మిగతా పథకాలు ఎప్పుడు చేస్తారని అడుగుతున్నారు. గత జగన్ ప్రభుత్వం అబద్దాల హామీలు ఇచ్చి అరకొరక పథకాలు ఇచ్చి చేతులు దులుపుకొని ఎన్నికల్లో గల్లంతు అయ్యారు. కాబట్టి ప్రస్తుత ప్రభుత్వం కూడా అలాంటి జాడలో పోకుండా ఇచ్చిన హామీని ప్రతి ఒక్కటి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలా కాని ఎడల అన్ని పార్టీలను ఏకతాటిపై తెచ్చుకుని అనుబంధ కార్మిక సంఘాలను కలుపుకుని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై పోరాటాలు ద్వారా ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామంలో పరిసరాల పరిశుభ్రత కోసం కంపచెట్లు తొలగింపు



తాడిపత్రి మేజర్ న్యూస్:తాడిపత్రి మండల పరిధిలోని పులి ప్రొద్దుటూరు గ్రామం లో జెసి ఫ్యామిలీ అభిమాని పొలిమేర మురళీమోహన్ రెడ్డి గ్రామంలోని ఆదివారం పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు జేసీబీ తో గ్రామంలో సీసీ రోడ్ కి ఇరుప్రక్కల ఊరిలోని వాటర్ ట్యాంక్ చుట్టూ, రైతులు వెళ్లే రహదారి కి ఇరుపక్కల పలుచోట్ల ఉన్న కంప చెట్లను తొలగించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పొలిమేర మురళీ మోహన్ రెడ్డి, మడూరు నాగేశ్వర్ రెడ్డి,పల్లె జగదీష్ రెడ్డి,పల్లె విజయ్ రెడ్డి, పడమల మహేష్ రెడ్డి, పొలిమేర రామ్మోహన్ రెడ్డి,పత్తి నాగముని రెడ్డి,మడూరు మధు రెడ్డి, దూదేకుల మస్తాన్ పాల్గొన్నారు.

# 5న అనంత హార్టికల్చర్ కాంక్లేవ్

## - బళ్లారి రోడ్ ఎంవైఆర్ కన్వెన్షనల్ హాల్ లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం
## - ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ కార్యక్రమం ఏర్పాటు
## - 64 జాతీయస్థాయి కంపెనీలు.. 6 ఎంఓయులు - ప్రెస్ మీట్‌లో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ వెల్లడి

**అనంతపురం మేజర్ న్యూస్ ప్రతినిధి :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో సోమవారం సాయంత్రం అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 5వ తేదీన అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, నగరంలోని బళ్లారి రోడ్ లో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షనల్ హాల్ లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీని ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతపురం జిల్లాను ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ గా పిలుస్తామని, ఇక్కడ ఉద్యాన పంటల సాగుకు విపరీతమైన అవకాశం ఉందన్నారు. ఇక్కడ వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, ఇక్కడి నుంచి పండిస్తున్న అరటి ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయని, జిల్లాలో 1,04,021 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగు అవుతున్నాయని, సుమారుగా 25.96 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పాదకత ఉందన్నారు. ఉద్యాన పంటల సాగులో రాష్ట్రంలోని 26 జిల్లాలలో అనంతపురం జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. అనంతపురం జిల్లా యొక్క జి వి ఏ లో 45 శాతం వాటా ఒక్క ఉద్యాన ఉత్పతులు ద్వారా వస్తోందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జి.ఎస్.డి.పి లో 11.73 శాతం వాటా అనంతపురం జిల్లా అందిస్తోందన్నారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, జిల్లాలు ఎక్కడ ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణ ఆంధ్రప్రదేశ్ ప్రణాళికను రూపొందించడం జరిగిందన్నారు. ఆ ప్రక్రియలో జిల్లాలో 5 గ్రోత్ ఇంజన్స్ ను గుర్తించడం జరిగిందని, ఎక్కడ మనం దృష్టి పెట్టడం వల్ల రైతులకు వచ్చే ఆదాయం రెట్టింపు చేయవచ్చని, జిల్లా 17 శాతం అభివృద్ధిని రాబోయే 5 సంవత్సరాల్లో చేయొచ్చన్నారు. జిల్లాలో అరటి, ఎండుమిరప, బత్తాయి, టమోటా, మామిడిపండ్లను జిల్లా ఉద్యాన గ్రోత్ ఇంజన్స్ గా గుర్తించడం జరిగిందని, రాష్ట్ర, దేశస్థాయితో పాటు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా ప్రయత్నం మనం చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో అనంతపురంలో జాతీయస్థాయి కాంక్లేవ్ ని ఏర్పాటు చేశామన్నారు. నెలరోజులుగా ఈ కార్యక్రమంపై కసరత్తు చేస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని, జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ.భరత్ వర్చువల్ గా పాల్గొంటారని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడును కూడా ఈ కార్యక్రమానికి పిలవడం జరిగిందని, అగ్రికల్చర్ అండ్ కోపరేటివ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ప్రోగ్రామ్ మెంటార్ గా ఉంటారన్నారు. ఈ సంవత్సరం నుంచి మొదలుకొని ప్రతి సంవత్సరం కూడా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేద్దామని అనుకుంటున్నామన్నారు. ఇందులో లేటెస్ట్ టెక్నాలజికల్ డెవలప్మెంట్, ప్రీ హార్వెస్ట్, హార్వెస్ట్, పోస్ట్ హార్వెస్ట్ ఈ మూడు స్థాయిలో కూడా చివరి వరకు టైఅప్ చేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పారని, ప్రతి దాంట్లో ప్రోడక్ట్ ఫర్ఫెక్షన్ తీసుకోవచ్చని, గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లాలంటే నాణ్యత అవసరమన్నారు. ఇప్పటికే జాతీయస్థాయిలో 64 కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలియజేశారని, అందులో 6 పరస్పర అవగాహన ఒప్పందాలు (ఎంఓయులు) తీసుకుంటున్నామన్నారు. ప్రీ హార్వెస్ట్ లో సాంకేతిక శిక్షణలు ఇవ్వడం, పోస్ట్ హార్వెస్ట్ లో ఎన్ని మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తారు, హార్వెస్ట్ టైంలో మనకు అవసరమైన ఎరువులు, పురుగు మందుల వాడకం లాంటి వాటికి సంబంధించి ఒప్పందాలు ఉంటాయన్నారు. ఇంకా కొంతమంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయ మిత్రులను ఆహ్వానిస్తున్నామని, రాష్ట్రస్థాయి పాత్రికేయులను కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానించాలన్నారు.

అనంతపురం జిల్లా ఉద్యాన ఉత్పత్తులను బ్రాండింగ్ చేయడం, ప్రచారం కల్పించడం, కోల్డ్ స్టోరేజ్ లు, ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించడం, మార్కెట్లో పోటీతత్వం పెంచడం, రైతులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో అవగాహన పెంపొందించడం, రెండింతలు ఆదాయం రైతుకు కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ప్రారంభ కార్యక్రమం, తర్వాత మూడు టెక్నికల్ సెషన్ లు ప్రీ హార్వెస్ట్ సెషన్, హార్వెస్ట్ సెషన్, పోస్ట్ హార్వెస్ట్ సెషన్ లు, 3 ప్యానల్ డిస్కషన్స్ ఉంటాయన్నారు. ఇందులో శాస్త్రవేత్తలు, హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ లు కూడా పాల్గొంటారని, ఈ కార్యక్రమాలు లైవ్ టెలిక్యాస్ట్ కూడా యూట్యూబ్ లో ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో 16 మంది స్పెయిన్ లాంటి విదేశ మరియు దేశస్థాయి కార్పొరేట్ ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. 2016 - 17వ సంవత్సరంలో అరటి టన్ను 5,000 రూపాయలు వచ్చేదని, ఈరోజు చూసుకుంటే 25 వేల రూపాయలు వస్తోందని, ఎకరాకి 3 నుంచి 4 లక్షల రూపాయలు ఆదాయం వస్తోందని తెలిపారు. జిల్లాలో అదనంగా 25 వేల హెక్టార్లని ఒక ఏడాదిలో అదనంగా పెంచాలనేది తమ లక్ష్యమన్నారు. ఇందులో అరటి క్లస్టర్, చీని క్లస్టర్, మామిడి క్లస్టర్, లాంటివి ఏర్పాటు చేస్తూ జిల్లాలో ప్రతి మండలంలో ఎంత హార్టికల్చర్ సాగు చేస్తున్నాం, మైక్రో ఇరిగేషన్ ఎంత ఉంది, ఒక సంవత్సరానికి ఎంత దిగుబడి వస్తుంది, తదితర వివరాలను కంపెనీల ముందు పెట్టడం జరుగుతుందన్నారు. ఎంఓయు అంటే నాన్ ఫైనాన్షియల్, నాన్ లీగలి బైండింగ్ చేస్తున్నామని, కంపెనీలు రకరకాల మధ్యవర్తుల నుంచి రైతుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, తాను కూడా ఎంఓయులో సంతకం చేయడం జరుగుతుందని, జిల్లా యంత్రాంగంతోపాటు రైల్వే శాఖ, ఇతర శాఖల వారిని కూడా ఈ కార్యక్రమానికి పిలవడం జరిగిందని, ఉద్యాన పంటలను ఇండియా నుంచి ఎగుమతి చేసే కంపెనీ ఇందులో పాల్గొంటున్నారని, ఐటిసితో కూడా ఎంఓయు చేసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తున్నారని, కొంతమంది రైతులు, రైతు సంఘం నాయకులు వస్తున్నారని, బాగా కృషిచేసిన వారికి అవార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో ఐటీసీ, స్విగ్గి, జొమాటో, రిలయన్స్, మైక్రో అగ్రీ సొల్యూషన్స్, నెటాఫిమ్ ఇరిగేషన్స్, ఆగ్రో లైఫ్ స్టైల్ కార్పొరేషన్, కోరమండల్ ఇంటర్నేషనల్, జిఎం పవర్ సిస్టం, ఫసల్ లాంటి సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డెమానిస్ట్రేషన్స్ అండ్ ఎగ్జిబిషన్ స్టాల్ ఏర్పాటు చేస్తున్నామని, ఎలైట్ బయో టెక్నాలజీస్, డిజిటల్ గ్రీన్, నెటాఫిమ్ ఇరిగేషన్స్, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఫసల్, లాంటి కంపెనీలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు డెలిగేట్స్ ని, ఎన్జీవోలను ఆహ్వానిస్తున్నామన్నారు. జిల్లాని అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, స్వర్ణ అనంతపురం 2047లో భాగంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. అనంతపురం జిల్లా ఫర్ క్యాపిటల్ ఇన్కంలో 6వ స్థలంలో ఉందని, టాప్ 3 స్థానానికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఓ ఏ.మాలోల, హార్టికల్చర్ డిడి నరసింహారావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, డిటిడబ్ల్యుఓ రామాంజనేయులు, హార్టికల్చర్ అధికారి పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

## జెసి గృహాన్ని సందర్శించిన బిసి



అనంతపురం మేజర్ న్యూస్ ప్రతినిధి : తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి స్వగృహాన్ని రోడ్డు భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జెసి ప్రభాకర్ రెడ్డి పెద్ద ఎత్తున అభిమానులు కార్యకర్తల తో ఘనస్వాగతం పలికారు.

ఈ సందర్భంగా బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. గత 5 సంవత్సరాల కాలంలో పెద్దారెడ్డి నిరంకుశత్వ దుర్మార్గాలను కేవలం జెసి ప్రభాకర్ రెడ్డి కాబట్టి తట్టుకోగలిగారని ఆయన కొనియాడారు. తాడిపత్రి నియోజకవర్గం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందన్నారు. జిల్లాలో రోడ్లకు26 కోట్లు మంజూరు కాగా కేవలం తాడిపత్రి లో ఎమ్మెల్యే జెసి అశ్మిత్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి ల విజ్ఞప్తి మేరకు 11 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి తో పాటుగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కూడా జెసి ప్రభాకర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై ఆందోళనలు జయప్రదం చేయండి

- ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్

**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్:** కార్మిక చట్టాలు అమలు చేయాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో ఏఐటియుసి జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కార్మికుల సంక్షేమానికి నయాపైసా కేటాయించకుండా మోసం చేసిందన్నారు. ఇప్పటికే 44 కార్మిక చట్టాలను సవరణలు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులకు ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి కార్మికులు,ఉద్యోగుల ఏ ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. అధికారంలోకి రాక మునుపు కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని చెప్పి హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కారన్నారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ కార్మికుల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవరిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పిఆర్సి కమిటీని వెంటనే వేయాలన్నారు. కార్మికుల సమస్యలపై అవగాహన కోసం అనంతపురం జిల్లా స్థాయి శిక్షణా తరగతులు ఈనెల 22 23 24 తేదీలలో జరుపుకొని భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణుడు, జిల్లా ఉపాధ్యక్షులు గోవిందు, నాగవేణి, శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులు చిరంజీవి,రాజు, శ్రీనివాసులు, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.
































# ప్రాక్టికల్ వసూల్

## ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల ఫీజుల దందా...

**స్క్వాడ్.. ఇన్విజిలేటర్లకు ఇవ్వాలంటూ డిమాండ్...**

**అక్రమ వసూళ్లకు తెరలేపిన జూనియర్ కళాశాలల యాజమాన్యాలు..**

**అన్నీ తెలిసిన చోద్యం చూస్తున్న ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు...**

**అనంతపురం మేజర్ న్యూస్ ప్రతినిధి**

అక్రమ వసూళ్లకు కాదేది అనర్హం అన్నచందంగా వ్యవహరిస్తున్నాయి ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు. బోర్డు పరీక్షలకు ముందు నిర్వహించే ప్రాక్టికల్స్ ను క్యాష్ చేసుకునేందుకు విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. ఓవైపు మొత్తం ఫీజు చెల్లించాలని హుకుం జారీ చేస్తూనే.. మరోవైపు ప్రాక్టికల్స్ లో పాస్ కావాలన్నా అధిక మార్కులు వేయాలన్నా.. స్క్వాడ్, ఇన్విజిలేటర్లకు డబ్బులు ఇవ్వాలని అక్రమ వసూళ్లకు పాల్పడడం ఆయా విద్యా సంస్థల యాజమాన్యాల దిగజారుడుతనానికి నిదర్శనం. ప్రాక్టికల్స్ పేరుతో ఒక్కో విద్యార్థి నుండి 800 నుండి 1500 రూపాయల వరకు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై భారం మోపుతున్నాయి. ప్రాక్టికల్స్ పేరిట అక్రమ వసూళ్లకు ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు పాల్పడుతున్న ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు చోద్యం చూస్తూ ఉండడం గ్రహనీయం.

### విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్న విద్యాసంస్థల యాజమాన్యాలు..



కరవు జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రాక్టికల్స్ పేరిట అక్రమ దందాకు పాల్పడడం విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకోవడమే అవుతుంది. ఇప్పటికే అక్రమ వసూళ్లపై తీవ్ర ఆరోపణలు వ్యక్తం అవుతున్న ఆర్ఐఓ చోద్యం చూస్తూ ఉండడం సిగ్గుచేటు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకొని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని పరమేష్ హెచ్చరించారు.

**పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**

### ప్రాక్టికల్ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలి..



ప్రాక్టికల్ ఫీజు పేరు తో కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయి. డబ్బులు కట్టని విద్యార్థులతో మీకు మార్కులు తగ్గిస్తమని రకరకాలు గా విద్యార్థులని భయ భ్రాంతులు కి గురి చేస్తున్నారు. దీని వలన విద్యార్థులు సరిగా పరీక్షలు రాయాక ఫెయిల్ అయ్యే పరిస్థితి నెలకొంది. వెంటనే ఈ అక్రమ వసూళ్ల కి గండి వేయాలని అదికారులు అప్రమత్తం గా ఉండాలని జనసేన పార్టీ విద్యార్థి విభాగం సిద్దు డిమాండ్ చేశారు.

**సిద్దు, జనసేన భగత్ సింగ్ విద్యార్థి విభాగం**

### అక్రమ వసూళ్లను అరికట్టకపోతే ఆర్ఐఓ కార్యాలయం వద్ద ధర్నా..

**కుల్లాయి స్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి**



ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థుల నుంచి 800 నుంచి 1500 వరకు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు మేము కళాశాల ఫీజు చెల్లిస్తున్నాం కదా ప్రాక్టికల్స్ డబ్బులు ఎందుకు ఇవ్వాలంటే మీరు ప్రాక్టికల్స్ లో పాస్ అవ్వాలంటే డబ్బులు ఇవ్వాల్సిందే. ఆ డబ్బులను మీకు స్క్వాడ్ ఇన్విజిలెటర్ గా వస్తున్న వారికి ఇవ్వాలనీ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు తెలియజేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రాక్టికల్స్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న విద్యా సంస్థల పైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ గా కోరుచున్నాము లేనిపక్షంలో విద్యాసంస్థల ఎదుట ఆర్.ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని కుల్లాయి స్వామి హెచ్చరించారు.

### కార్పొరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతున్న ఆర్ఐఓను సస్పెండ్ చేయాలి...



ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్మీడియట్ విద్యాసంస్థలు ప్రాక్టికల్స్ పేరిట అక్రమ దందాకు పాల్పడుతున్న చోద్యం చూస్తున్న ఆర్ ఐ ఓ ను తక్షణమే సస్పెండ్ చేయాలి. ఆయన ప్రభుత్వ అధికారిగా కాకుండా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఏజెంట్గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల పక్షాన ఎంతటి పోరాటానికైనా సిద్ధమని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్ స్పష్టం చేశారు.

**బిసి సురేష్ యాదవ్,**
**విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

## వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టులపై విచారణ జరిపించాలి

### కలెక్టర్ వారి కార్యాలయం ముందు విహెచ్‌పిఎస్, ఎంఆర్‌పిఎస్ నాయకులు ధర్నా

### విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్న జిల్లా కలెక్టర్ హామీ

కూడేరు, మేజర్ న్యూస్ : అనంతపురం జిల్లా కూడేరు మండలం కరుట్లపల్లి గ్రామ నివాసి అయిన అంద వికలాంగుడు ముత్యాలన్న ఆయన భార్య ఇద్దరు వికలాంగులె.. 2023వ సంవత్సరములో వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయుటకు ప్రభుత్వం అనుమతించిందనీ వాటిలో భాగంగ ముత్యాలన్న తో పాటు కుక్కు పోస్టుకు మరి కొంత మంది అప్లై చేసుకున్నారు. అప్లై చేసిన వారిలో కొంతమంది ఫేక్ సర్టిఫికెట్లు పెట్టినట్లు ముత్యాలన్న గుర్తించడం జరిగింది. ఈ విషయమై అప్పటి జిల్లా కలెక్టర్ గౌతమికి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు. ముత్యాలన్న ఫిర్యాదు మేరకు ఆ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లను పరిశీలించలని కలెక్టర్ మేడమ్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని, విచారణ చేసిన సంబంధిత అధికారులు ఇవి పేక్ సర్టిఫికెట్లు అని తేల్చిన వారిపై ఎటువంటి చర్యలు లేకుండ తొలగించడము జరిగిందని అప్పటికే పేక్ సర్టిఫికెట్లలో ఒకరికి ఉద్యోగం ఇప్పిచ్చే విధంగ ఒప్పందం చేసుకున్న ఏ సెక్షన్ లో పనిచేస్తున్న కుమారి సీనియర్ అసిస్టెంట్ అయిన ఆమె ముత్యలన్నను నువ్వే కద కలెక్టర్ కి ఫిర్యాదు చేసినది నీవు ఎలా ఉద్యోగం తీసుకుంటావో నేను చూస్తా అంటూ ముత్యాలన్నా ను బెదిరించడమే కాకుండ దంపతులు ఇద్దరినీ చెప్పుకోలేని భాషలో సీనియర్ అసిస్టెంట్ గ పనిచేస్తున్న కుమారి నానాదుర్భాషలాడం జరిగిందని, ప్రస్తుతం అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌కి రాంగ్ రిపోర్ట్ ఇచ్చి ముత్యాలన్నకి అన్ని రకాల హర్వత ఉన్న పోస్టు రాకుండ చేయడమే కాకుండ అంద వికలాంగుడు ముత్యాలన్నాను ఆయన భార్యను



మానసికంగ వేధించడం జరిగిందని వాపోయారు. వీటి పైన ప్రస్తుత కలెక్టర్ వినోద్ కుమార్ విచారణ జరిపించాలని బాధ్యులైన సీనియర్ అసిస్టెంట్ కుమారితో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని అంద వికలాంగుడైన ముత్యలన్న కుటుంబానికి న్యాయం చేయాలని కోరుచున్నాము. అలాగే వికలాంగుల కోటాలో ఉద్యోగాలు పొంది ఆ ఉద్యోగాలకు వారు హాజరు కాకుండ వారి ప్లేసులో వేరే వారికి కొంత డబ్బులు ఇచ్చి వారితో విధులు నిర్వహిస్తు వీరు బయట ప్రైవేటు పనులు చేసుకుంటూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. కావున తక్షణమే అటువంటి వారిని గుర్తించి వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. గతం నుండి నేటి వరకు వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టులలో ఉద్యోగాలు చేస్తున్న అన్ని డిపార్ట్మెంట్లలోనూ వారి సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేయాలని కోరుతున్నాము తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో విహెచ్పిఎస్ రాష్ట్ర అదికార ప్రతినిధి పెద్దన్నతో పాటు విహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు జానకి రామయ్య, కళ మండలి జిల్లా అధ్యక్షులు పుల్లన్న, విహెచ్పిఎస్ మహిళ అధ్యక్షురాలు జయమ్మ, విహెచ్పిఎస్ మహిళ కమిటీ నాయకురాలు వరాలమ్మ, హుస్సేన్, బి,ఈశ్వరమ్మ కళావతి, ఎంఆర్పిఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు సామ్రాట్ మధు, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, బాలరాజు, కృష్ణమూర్తి, విహెచ్పిఎస్ నగర కార్యదర్శి చెనరాయుడు, తదితర వికలాంగులు నాయకులు మహిళలు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.



## హరీష్ స్కూల్ లో ఘనంగా వసంత పంచమి ప్రత్యేక పూజలు

**కదిరి రూరల్, మేజర్ న్యూస్:** కదిరి రూరల్ పరిధిలోని ఎరుకల వాండ్ల పల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో సోమవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతీ దేవి ఆలయంలో పాఠశాల ప్రిన్సిపాల్ యం.యన్. కిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జ్ఞానానికి అధిదేవత సరస్వతీ దేవి అని, ఆమె జ్ఞానస్వరూపిణి, శాస్త్రం, కళలు, విజ్ఞానం, హస్తకళలు తదితర వాటిని చదువుల తల్లి సరస్వతి అంశాలుగా మన పెద్దలు భావిస్తార న్నారు. సృజనాత్మక శక్తికి, స్ఫూర్తికి కూడా వీణాపాణి అయిన సరస్వతిని సంకేతంగా చెప్పడం మన సంప్రదాయమని తెలిపారు. జ్ఞానశక్తికి అధిష్టాన దేవత సరస్వతీమాత అని పేర్కొన్నారు. జ్ఞాన, వివేక, దూరదర్శిత్వ, బుద్ధిమత్తత, విచార శీలం తదితరాలను శ్రీవాణి అనుగ్రహిస్తుందని మన పూర్వీకులు చెబుతారని పేర్కొన్నారు. సత్వ, రజస్తమో గుణాలను బట్టి అమ్మలగన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ అయిన జగన్మాతను మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతిగా కీర్తిస్తారని గుర్తు చేశారు. ఈ ముగ్గు రిలో సరస్వతీదేవి పరమ సాత్వికమూర్తి, అహింసాదేవి అన్నారు. అనంతరం పూజారి కరణంరెడ్డి ప్రసాద్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేతిరెడ్డి పెద్దారెడ్డికి.. మళ్లీ చుక్కెదురు..!

**– తాడిపత్రిలో ఎంట్రీకి నో పర్మిషన్ – పెద్దారెడ్డి తాడిపత్రికి రీ ఎంట్రీ ఇస్తున్నారన్న సమాచారంతో అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం**

**– పోలీసుల వలయంలో తాడిపత్రి, తిమ్మంపల్లి – పెద్దారెడ్డి తిమ్మంపల్లిలోనే హౌస్ అరెస్ట్**

**తాడిపత్రి, మేజర్ న్యూస్:** తాడిపత్రి వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలోకి రీ ఎంట్రీ ఘట్టం అట్టర్ ఫ్లాఫ్ అయింది.. సోమవారం మరోసారి ఆయనకు చుక్కెదురైంది. ఆయన తాడిపత్రిలోకి అడుగుపెడితే శాంతి భద్రతల సమస్య మొదటి నుంచి పోలీసులు ఆయన రాకకు అభ్యంతరం చెబుతూ వస్తున్నారు. అయితే ఇది అ ప్రజాస్వామికమని.. తన నియోజకవర్గంలోకి తాను ఎందుకు వెళ్ళకూడదు అన్న విషయంగా ఆయన హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్ ఇంకా విచారణలో ఉండగానే ఆయన తాజాగా సోమవారం మరోసారి తాడిపత్రిలోకి అడుగుపెట్టే ప్రయత్నం చేసి భంగపడ్డారు. ఆయన తాడిపత్రిలోకి అడుగుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిసి పోలీసు యంత్రాంగం అప్రమత్తమై ఎక్కడికక్కడ కట్టుదిట్టం చేశారు. గతంలో జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకొని ఎట్టి పరిస్థితిలో పునరావతంకాకుండా డ్రోన్లను సైతం ఏర్పాటుచేసి గట్టి నిఘా పెంచారు. తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం తో పాటు భగత్ సింగ్ నగర్ లోని ఆయన నివాసం వద్ద భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. అలాగే ఆయన స్వగ్రామం సింగనమల నియోజకవర్గం యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామంలో కూడా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తాడిపత్రి కి ఇటీవల కొత్తగా నియమితులైన ఏ ఎస్ పి రోహిత్ కుమార్ చౌదరి నేతృత్వంలో అనంతపురం జిల్లా నుండే కాకుండా కర్నూలు జిల్లా నుండి కూడా వచ్చిన అదనపు బలగాలు దాదాపు 700 మందికి పైగా తాడిపత్రి పట్టణం, తిమ్మంపల్లిలో పహారా కా శాయి. కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం తాడిపత్రిలోకి అడుగు పెట్టాలని నిర్ణయించుకొని ఇందుకు సంబంధించి ఆదివారం నుండే తన అనుయాయులతో భారీగా వాహనాలను సమకూర్చుకొని సిద్ధమయ్యారు. అయితే ఆయన ప్రయత్నం ఎక్క డా ఫలించలేదు. పోలీసులు ఆయనను ఇసుమంత కూడా కదిలేందుకు వీలు లేకుండా కట్టుదిట్టం చేశారు. ఇది ఇలా ఉండగా కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న విషయం తెలిసి తాడిపత్రి లోని జేసీ అనుచరులు, ఆయన రాకను వ్యతిరేకిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయనను అడ్డుకుని తీరతామన్న వారి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హల్చల్ చేశాయి. ఇదిలా ఉండగా సోమవారం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి తాడిపత్రిలో నే ఉన్నారు. అయితే కేతిరెడ్డి పెద్దారెడ్డి రీ ఎంట్రీ విషయమై ఇప్పటిదాకా ఆయన నోరు మెదపలేదు. కాగా రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తాడిపత్రికి రావడంతో ఆయన రిసీవ్ చేసుకోవడం.. స్వాగత సత్కారాలు, అతిథి మర్యాదలు కార్యక్రమంలో ఆయన పూర్తిగా నిమగ్నం అయిపోయారు.





### తాడిపత్రిలో ప్రజాస్వామ్యానికి పాతర
### తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి అసహనం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిపత్రిలో ప్రజాస్వామ్యానికి పాతర వేశారని తాడిపత్రి వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ప్రధానంగా జేసి ప్రభాకర్ రెడ్డి
కను సన్నలలోనే పోలీసు యంత్రాంగం పని చేస్తోందని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చోటు చేసుకున్న అవాంఛనీయ సంఘటన కారణంగా ఆయన గత ఏడు నెలలుగా తాడిపత్రికి దూరంగా ఉంటున్నారు. పోలీసులు కూడా ఆయన రాకను అనుమతి ఇవ్వకుండా నిరాకరిస్తున్నారు. ఇదే విషయమై ఆయన హైకోర్టులో రిప్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ విచారణ దశలో ఉండగానే ఆయన మరోసారి తాజాగా సోమవారం తాడిపత్రిలోకి రీ ఎంట్రీ ఇచ్చేందుకు ప్రయత్నించి భంగపడ్డారు. సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనను తాడిపత్రిలోకి ఏడు నెలలుగా అడుగుపెట్టనివ్వడం లేదని విచారం వ్యక్తం చేశారు. పోలీసులు ఈ విషయంలో పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. టిడిపి నేతలు పోలీసులపైనే పెత్తనం చెలాయిస్తుంటే చోద్యం చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ జగదీష్ తనను తాడిపత్రిలోకి అనుమతించే విషయమై మరోసారి పునరాలోచించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

